


# మన దునియా

Our News Our World

RNI Number
TELTEL/2023/85680

మన అక్షరం - మన ప్రపంచం

సంపుటి : 3 | సంచిక : 260 | మే 18 సోమవారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-







## అధికార మదంతో!?

### ఉపాధి కూలీల సమస్యలు అడిగితే

# విలేఖరులపై బెదిరింపులు!




- అధికార పార్టీ అండ చూసుకుని వీరంగం సృష్టించిన తాడెం సర్పంచ్ జలంధర్ రెడ్డి
- ఎంపీడీవో కార్యాలయంలోనే విలేఖరులపై అసభ్య పదజాలంతో దూషణలు
- కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ అహంకారపూరిత ప్రవర్తన
- సర్పంచ్, పంచాయతీ సెక్రటరీలపై చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

**మన దునియా,నిజామాబాద్ జిల్లా ప్రతినిధి:మే 17**

జిల్లాలో ప్రజాప్రతినిధుల అహంకారం, అధికార మదం పరాకాష్టకు చేరింది. ప్రజల సమస్యలను, వాస్తవాలను వెలుగులోకి తెస్తున్న పత్రికా విలేఖరులపై ఓ సర్పంచ్ బూతు పురాణంతో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు, మోపాల్ మండలం తాడెం గ్రామ పంచాయతీ సర్పంచ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు జలంధర్ రెడ్డి అగ్రవర్ణ అహంకారంతో, రాజకీయ పలుకుబడితో జర్నలిస్టులపై దురుసుగా ప్రవర్తించిన ఘటన నిజామాబాద్ జిల్లాలో తీవ్ర కలకలం రేపుతోంది.

**కలెక్టర్ ఆదేశాలు కాగితాలకే పరిమితం!**

ప్రస్తుతం ఎండలు 45 డిగ్రీల మార్కును తాకుతుండటంతో ఉపాధి హామీ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి గ్రామ పంచాయతీలో కూలీలకు త్రాగునీరు, టెంట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయితే తాడెం గ్రామ పంచాయతీలో కూలీలకు కనీస వసతులు కరువయ్యాయి. ఈ వాస్తవాలను 'మన దునియా' పత్రిక ద్వారా ప్రజలకు, అధికారులకు తెలియజేసేందుకు శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో పత్రికా ప్రతినిధులు మోపాల్ ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లారు.

**ఎంపీడీవో ఆఫీస్‌లోనే హైడ్రామా -- ఫోన్‌లో బెదిరింపులు**

ఉపాధి కూలీల సమస్యలను అక్కడే ఉన్న తాడెం గ్రామ పంచాయతీ సెక్రటరీ మృతుజ దృష్టికి విలేఖరులు తీసుకెళ్లగా.. "మా సర్పంచ్‌కు చెప్తాను" అంటూ ఆమె సమాధానమిచ్చారు. ఆ తర్వాత ఐదు నిమిషాల వ్యవధిలోనే సర్పంచ్ జలంధర్ రెడ్డి సదరు సెక్రటరీకి ఫోన్ చేశారు. ఆఫీసులోనే ఉన్న ఇద్దరు పత్రికా మిత్రులకు ఫోన్ ఇవ్వాలని సర్పంచ్ ఆదేశించడంతో, సెక్రటరీ 'మన దునియా' ప్రతినిధికి ఫోన్ అందించారు.ఫోన్ చేతికి రాగానే సర్పంచ్ జలంధర్ రెడ్డి సంస్కారహీనంగా, ఇష్టం వచ్చినట్లు అసభ్య పదజాలంతో బూతు పురాణం అందుకున్నారు. ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉండి, పత్రికా ప్రతినిధులను ఫోన్లోనే తీవ్రంగా బెదిరించారు. ఈ దారుణాన్ని అక్కడే ఉన్న మరో రిపోర్టర్ తన మొబైల్‌లో పూర్తిగా రికార్డ్ చేయడాన్ని గమనించిన సెక్రటరీ.. ఒక్కసారిగా విలేఖరి చేతిలో నుంచి ఫోన్‌ను లాక్కునే ప్రయత్నం చేశారు.

**సెక్రటరీ తీరుపై అనుమానాలు.. అధికారుల విచారణ**

ప్రభుత్వ ఉద్యోగి అయిన సెక్రటరీ.. ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాల్సింది పోయి, ప్రతీ చిన్న విషయానికి ప్రజాప్రతినిధులకు ఫోన్ చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జర్నలిస్టులపై సర్పంచ్ బూతులతో విరుచుకుపడుతుంటే ఆపాల్సింది పోయి, రికార్డింగ్ అవుతున్న ఫోన్‌ను లాక్కోవడం ఆమె నిర్లక్ష్యానికి, సర్పంచ్‌కు (మిగతా 2వ పేజీలో..)

---

## భారత్‌కు తిరిగి వస్తున్న చోళుల కాలం నాటి రాగి ఫలకాలు.."ఇది ప్రతి భారతీయుడికి ఆనంద క్షణం":మోదీ

- 11వ శతాబ్ది నాటి చోళుల రాగి ఫలకాలు భారత్‌కు రాక
- నెదర్లాండ్స్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోదీ
- రాజరాజ చోళుడు, రాజేంద్ర చోళుడి కాలం నాటివిగా గుర్తింపు
- ఇది ప్రతి భారతీయుడికి ఆనంద క్షణమన్న ప్రధాని మోదీ
- 1862 నుంచి లైడెన్ యూనివర్సిటీ వద్ద ఉన్న ఫలకాలు

భారత చారిత్రక, సాంస్కృతిక వారసత్వానికి సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. 11వ శతాబ్దానికి చెందిన చోళుల కాలం నాటి అమూల్యమైన (మిగతా 2వ పేజీలో..)



---

## మిస్టర్ మోదీ... దేశం మిమ్మల్ని కొన్ని ప్రశ్నలు అడుగుతోంది... బదులివ్వండి: రాహుల్ గాంధీ

- నీట్ పేపర్ లీక్‌పై ప్రధాని మోదీని టార్గెట్ చేసిన రాహుల్ గాంధీ
- 2024, 2026 సంవత్సరాలను పోలుస్తూ ప్రభుత్వ వైఖరిపై వ్యంగ్యాస్త్రాలు
- 'పరీక్షా పే చర్చ'పై ప్రధాని మోదీ మౌనాన్ని ప్రశ్నించిన ప్రతిపక్ష నేత
- దేశం అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్



---

## బండి సంజయ్‌ను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలి: కేటీఆర్

**మన దునియా,హైదరాబాద్,మే 17.**

పోక్సో చట్టం కింద బండి భగీరథ్ అరెస్ట్ అయిన నేపథ్యంలో ఈ కేసు నిష్పక్షపాతంగా విచారణ జరగాలంటే కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని ప్రధాని మోదీని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఎల్ బీ నగర్‌లో నిర్వహించిన 'నా బూత్.. నా భవిష్యత్తు' కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. ప్రధాని మోదీ 'బేటీ పడావో.. బేటీ బచావో' అంటున్నారన్నారు. కేవలం ఇది నినాదాలకే పరిమితమైతే న్యాయం జరగదని పేర్కొన్నారు. భారతదేశంలో మొట్టమొదటిసారి కేంద్రమంత్రి కుమారుడి మీద లుకౌట్ నోటీస్ ఇచ్చే పరిస్థితి వచ్చిందని చెప్పారు.బండి సంజయ్‌ను కేంద్రమంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయకపోతే ఈ కేసు విచారణ సజావుగా జరిగే పరిస్థితి లేదని ఆందోళన

(మిగతా 2వ పేజీలో..)




---

## నీట్ పేపర్ లీక్ కేసు.. ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ సూటి ప్రశ్నలు

**మన దునియా,ఢిల్లీ:మే17**

ఢిల్లీ: నీట్ యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. పేపర్ లీక్ ఘటనపై ప్రతిపక్ష పార్టీలు, విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీపై నిప్పులు చెరిగారు. తాజాగా ప్రధాని మోదీకి మరోసారి పలు ప్రశ్నలు సంధిస్తూ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఈ సందర్భంగా సంబంధిత కేంద్ర మంత్రి రాజీనామా చేయకపోవడం, ప్రధాని మౌనంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

ఎంపీ రాహుల్ గాంధీ ఎక్స్ పోస్టు..

'నీట్ 2024 పేపర్ లీక్

(మిగతా 2వ పేజీలో..)



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## నీట్ పేపర్ లీక్ కేసు.. ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ సూటి ప్రశ్నలు

(మొదటి పేజీ తరువాయి)

అయింది. పరీక్ష రద్దు కాలేదు. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయలేదు. సీబీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. ఘటనపై నిజానిజాలు తేల్చేందుకు కేంద్రం కమిటీని కూడా ఏర్పాటు చేశారు. నీట్ 2026లోనూ పేపర్ లీక్ అయింది. పరీక్ష రద్దు అయింది. అయినా సంబంధిత కేంద్ర మంత్రి రాజీనామా చేయలేదు. సీబీఐ మళ్లీ దర్యాప్తు చేస్తోంది. మరో కమిటీని ఏర్పాటు చేయనున్నారు.మోదీ గారూ.. దేశం మిమ్మల్ని కొన్ని ప్రశ్నలు అడుగుతోంది. వాటికి సమాధానం చెప్పండి. పేపర్ లీక్ ఘటనలు పదేపదే ఎందుకు జరుగుతున్నాయి?. ఈ పరీక్షా పత్రాల లీక్‌పై మీరు ఎప్పుడూ ఎందుకు మౌనం వహిస్తున్నారు?. పదేపదే విఫలమవుతున్న విద్యాశాఖ మంత్రిని ఎందుకు తొలగించడం లేదు?' అంటూ ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీ పోస్టు పెట్టారు..

## తెలంగాణలోకి నైరుతి రుతుపవనాలు... ఈసారి కొంచెం ఆలస్యం!

**తెలంగాణలోకి జూన్ మొదటి వారంలో నైరుతి రుతుపవనాలు**

**గతేడాది కన్నా 4 నుంచి 5 రోజులు ఆలస్యంగా రాక**

**పలు జిల్లాల్లో కొనసాగుతున్న తీవ్రమైన ఎండలు, వడగాల్పులు**

**మే 26న కేరళను తాకనున్న నైరుతి పవనాలు**

**నేడు కొన్ని జిల్లాల్లో తేలికపాటి వర్షాలకు అవకాశం**



తెలంగాణలో నైరుతి రుతుపవనాల ఆగమనం కోసం మరికొన్ని రోజులు ఆగాల్సిందే. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు జూన్ మొదటి వారంలో రాష్ట్రంలోకి ప్రవేశించే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. గత ఏడాదితో పోలిస్తే రుతుపవనాల రాక 4 నుంచి 5 రోజులు ఆలస్యం కానుంది.ఈ నెల 26వ తేదీన కేరళను తాకనున్న రుతుపవనాలు, ఆ తర్వాత సాధారణంగా 4 నుంచి 7 రోజుల్లో తెలంగాణలోకి ప్రవేశిస్తాయని అధికారులు వివరిస్తున్నారు. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు అండమాన్ నికోబార్ దీవులు, బంగాళాఖాతం, అరేబియా సముద్రంలోని కొన్ని ప్రాంతాల్లో విస్తరించాయి. ఇవి మరింత ముందుకు సాగేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపింది.

కొనసాగుతున్న ఎండల తీవ్రత

ఇదిలా ఉండగా, రాష్ట్రంలో ఎండల తీవ్రత కొనసాగుతోంది. చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శనివారం అదిలాబాద్‌లో అత్యధికంగా 44.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డయింది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.మరోవైపు, నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆదివారం జోగులాంబ గద్వాల్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి, వనపర్తి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

## భారత్‌కు తిరిగి వస్తున్న చోళుల కాలం నాటి రాగి ఫలకాలు.."ఇది ప్రతి భారతీయుడికి ఆనంద క్షణం":మోదీ

(మొదటి పేజీ తరువాయి)

రాగి ఫలకాలు నెదర్లాండ్స్ నుంచి తిరిగి స్వదేశానికి రానున్నాయి. నెదర్లాండ్స్‌లోని ది హేగ్‌లో నిన్న జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ ఫలకాలను భారత్‌కు అప్పగించారు. ఈ కార్యక్రమానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ, డచ్ ప్రధాని రాబ్ జెట్టెన్ హాజరయ్యారు.ఈ రాగి ఫలకాల సెట్‌లో 21 పెద్దవి, 3 చిన్న ఫలకాలు ఉన్నాయి. వీటిపై సంస్కృతం, తమిళ భాషల్లో శాసనాలు ఉన్నాయి. తన తండ్రి రాజరాజ చోళుడు ఇచ్చిన వాగ్దానాన్ని కుమారుడైన రాజేంద్ర చోళుడు అధికారికంగా నెరవేర్చిన చారిత్రక ఘట్టాన్ని ఇవి వివరిస్తాయి. నాగపట్నంలోని బౌద్ధ విహారానికి అనైమంగళం గ్రామ ఆదాయాన్ని కేటాయించినట్లు ఈ ఫలకాలలో పొందుపరిచారు. చోళుల వైభవాన్ని, పరిపాలనా దక్షతను ఈ శాసనాలు తెలియజేస్తాయి.దాదాపు 1862 నుంచి ఈ ఫలకాలు నెదర్లాండ్స్‌లోని లైడెన్ యూనివర్సిటీ ఆధీనంలో ఉన్నాయి. వలస పాలన కాలంలో వీటిని అక్రమంగా తరలించారని నిర్ధారించిన డచ్ కమిటీ సిఫారసుల మేరకు, భారత ప్రభుత్వం చేసిన అభ్యర్థనతో వీటిని తిరిగి అప్పగించడానికి నెదర్లాండ్స్ ప్రభుత్వం అంగీకరించింది.ఈ పరిణామంపై ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా స్పందించారు. "ఇది ప్రతి భారతీయుడికి ఆనంద క్షణం" అని పేర్కొన్నారు. చోళుల గొప్పతనాన్ని, వారి సంస్కృతిని, సముద్ర వాణిజ్య నైపుణ్యాన్ని భారత్ ఎంతో గర్వంగా స్మరించుకుంటుందని తెలిపారు. ఈ ఫలకాలను ఇన్నాళ్లు భద్రపరిచిన లైడెన్ యూనివర్సిటీకి, నెదర్లాండ్స్ ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే ఈ ఫలకాలను అధికారికంగా భారత్‌కు తరలించనున్నారు.



# బండి సంజయ్‌ను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలి: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. తప్పు చేసిన కొడుకుని తొమ్మిది రోజులు దాచి పెట్టారంటూ కేంద్రమంత్రి సంజయ్‌పై ఆయన నిప్పులు చెరిగారు. సంజయ్ లాంటి వ్యక్తి పదవిలో కొనసాగడం తెలంగాణకే కాదు.. భారతదేశానికి కూడా అవమానకరమన్నారు. కేంద్ర మంత్రి కొడుకు మైనర్ బాలికకు అన్యాయం చేశాడని విమర్శించారు. మైనర్ బాలిక తల్లిదండ్రుల్ని స్వయాన కేంద్ర మంత్రి భయభ్రాంతులకు గురిచేశారని గుర్తు చేశారు.ఈ కేసును నీరుగార్చే ప్రయత్నం చేసింది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని కేటీఆర్ ఆరోపించారు. హనీ ట్రాప్ అని, మీడియాను మనీ ట్రాప్‌లో వేసి.. సీఎం రేవంత్, కేంద్ర మంత్రి బండి సంజయ్.. ఇద్దరూ మీడియాలో వార్తలు రానీవ్వకుండా చేశారని మండిపడ్డారు. కేంద్ర మంత్రి పదవి నుంచి సంజయ్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అలా చేయకుంటే తన మీద అఘాయిత్యం జరిగినా ముందుకు వచ్చే ధైర్యం ఏ ఆడబిడ్డ చేయదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే బండి సంజయ్‌ను కేంద్రమంత్రి పదవి నుంచి తొలగించి.. ఈ కేసు విచారణను నిష్పక్షపాతంగా జరిపించాలని కేంద్రానికి ఆయన స్పష్టం చేశారు.కేంద్రమంత్రి ఎన్ని రకాలుగా బెదిరింపులు, ఒత్తిళ్లు తెచ్చినా బాధిత బాలికకు తల్లి అండగా నిలబడిందన్నారు. ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి ఇద్దరూ కుమ్మక్కై ఆ అమ్మాయికి అన్యాయం చేయాలనుకున్నా.. ఆ తల్లిదండ్రులు వెనకడుగు వేయలేదని తెలిపారు. బాలిక తరపున పోరాటం చేసిన బీఆర్ఎస్ పార్టీ మహిళా విభాగానికి ఈ సందర్భంగా కేటీఆర్ అభినందనలు తెలియజేశారు. బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ కూడా ఈ కేసులో చాలా గట్టిగా కొట్లాడారని గుర్తు చేశారు. బండి భగీరథ్ లొంగిపోయాడు, అరెస్టయ్యాడంటూ డ్రామా నడుస్తున్నదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు..

# అధికార మదంతో!? ఉపాధి కూలీల సమస్యలు అడిగితే విలేఖరులపై బెదిరింపులు!

(మొదటి పేజీ తరువాయి)

కొమ్ముకాస్తున్న తీరుకు నిదర్శనం.ఈ ఘటనపై బాధితులు వెంటనే మండల పంచాయతీ అధికారి ఎంపీ ఓ కిరణ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సెక్రటరీని పిలిపించి వివరాలు కనుక్కోగా.. సర్పంచ్ ఇలా తిడతాడని తాను అనుకోలేదంటూ బుకాయించే ప్రయత్నం చేశారు. ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ముందే ఈ హైడ్రామా జరగడంతో అక్కడి వారంతా ముక్కున వేలేసుకున్నారు.

**కలెక్టర్ గారు.. చర్యలు తీసుకోండి!**

ప్రజల పక్షాన నిలబడి వార్తలు రాస్తున్న జర్నలిస్టులపై ఇష్టారాజ్యంగా దూషణలకు దిగిన తాడెం సర్పంచ్ జలంధర్ రెడ్డిపై, విధి నిర్వహణ మరిచి సర్పంచ్‌కు ఏజెంట్‌లా వ్యవహరించిన పంచాయతీ సెక్రటరీ  జిల్లా కలెక్టర్ కఠిన చర్యలు తీసుకోవాలని జర్నలిస్ట్ సంఘాలు, స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రజాస్వామ్య ప్రశ్నించే గొంతు గల పై  బెదిరింపు లకు ఫోన్లో అసభ్య పదజాలంతో వ్యవహరించిన వారిపై కఠినంగా ఇటు జర్నలిస్టు సంఘాలు స్థానిక ప్రజా ప్రతినిధులు  శిక్షించాలని కోరుతున్నారు.

# మిస్టర్ మోదీ... దేశం మిమ్మల్ని కొన్ని ప్రశ్నలు అడుగుతోంది... బదులివ్వండి: రాహుల్ గాంధీ

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 2024, 2026 సంవత్సరాల పరిస్థితులను పోలుస్తూ ప్రభుత్వ వైఖరిపై ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పదేపదే పేపర్ లీక్‌లు జరుగుతున్నా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవడంలో విఫలమవుతోందని ఆరోపించారు.

**ఈ సందర్భంగా రాహుల్ తన వ్యాఖ్యలలో...**

నీట్ 2024: పేపర్ లీక్ అయింది. పరీక్ష రద్దు కాలేదు. మంత్రి రాజీనామా చేయలేదు. సీబీఐ విచారణ, ఒక కమిటీ ఏర్పాటయ్యాయి.

నీట్ 2026: పేపర్ లీక్ అయింది. పరీక్ష రద్దు అయింది. కానీ మంత్రి మాత్రం ఇప్పటిదాకా రాజీనామా చేయలేదు. మళ్లీ సీబీఐ విచారణ, మరో కమిటీ ఏర్పాటవుతుంది" అంటూ ఎద్దేవా చేశారు.ఈ నేపథ్యంలో ప్రధాని మోదీకి దేశం తరఫున కొన్ని ప్రశ్నలు సంధిస్తున్నానని రాహుల్ పేర్కొన్నారు. "మిస్టర్ మోదీ, దేశం మిమ్మల్ని కొన్ని ప్రశ్నలు అడుగుతోంది. వాటికి సమాధానం చెప్పండి!" అంటూ మూడు సూటి ప్రశ్నలను లేవనెత్తారు.

1. పదేపదే పేపర్ లీక్‌లు ఎందుకు జరుగుతున్నాయి?
2. ఈ "పరీక్షా పే చర్చ" (పేపర్ లీక్‌లపై చర్చ) విషయంలో మీరెందుకు మౌనంగా ఉంటున్నారు?
3. పదేపదే విఫలమవుతున్న విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను ఎందుకు పదవి నుంచి తొలగించడం లేదు? ఈ ప్రశ్నలకు ప్రధాని సమాధానం చెప్పాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. వరుస పేపర్ లీక్‌ల పట్ల కేంద్ర ప్రభుత్వ ఉదాసీన వైఖరి తగదంటూ ఆయన హితవు పలికారు.

# ఢిల్లీ వెళ్తున్న రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో ఘోర అగ్నిప్రమాదం..

**రాజస్థాన్‌లోని కోటా సమీపంలో ఘటన**

**బీ–1 ఏసీ కోచ్‌లో చెలరేగిన మంటలు**

**68 మంది ప్రయాణికులు సురక్షితం**

**మంటలు వ్యాపించిన బోగీని వేరు చేసిన రైల్వే అధికారులు**

**ప్రయాణికులను ఇతర కోచ్‌లలోకి మార్చి ప్రయాణం కొనసాగింపు**

రాజస్థాన్‌లో పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. ఢిల్లీ వెళ్తున్న రాజధాని ఎక్స్‌ప్రెస్‌లోని ఓ ఏసీ కోచ్‌లో ఆదివారం ఉదయం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. అధికారులు సకాలంలో స్పందించడంతో ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని రైల్వే అధికారులు తెలిపారు.కేరళలోని తిరువనంతపురం నుంచి ఢిల్లీలోని హజ్రత్ నిజాముద్దీన్ స్టేషన్‌కు వెళ్తున్న 12431 రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో ఈ ప్రమాదం జరిగింది. ఆదివారం ఉదయం 5:15 గంటల సమయంలో రాజస్థాన్‌లోని కోటా సమీపంలో ఉన్న విక్రమ్‌గఢ్ అలోట్ రైల్వే స్టేషన్ వద్ద రైలు బీ–1 ఏసీ కోచ్‌లో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో కోచ్‌లో 68 మంది ప్రయాణికులు ఉన్నారు. వెంటనే అప్రమత్తమైన రైల్వే సిబ్బంది మంటలు వ్యాపించిన కోచ్‌ను రైలు నుంచి వేరు చేశారు. ముందుజాగ్రత్త చర్యగా ఓవర్ హెడ్ ఎలక్ట్రిక్ వైర్ల (ఓహెచ్ఈ) సరఫరాను నిలిపివేశారు. బోగీ నుంచి దట్టమైన నల్లటి పొగలు భారీగా ఎగసిపడ్డాయి. ప్రయాణికులందరినీ సురక్షితంగా కిందకు దించి, ఇతర కోచ్‌లలోకి మార్చారు. కోటా స్టేషన్‌లో ప్రయాణికుల కోసం మరో అదనపు కోచ్‌ను జతచేస్తామని అధికారులు ప్రకటించారు.



మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం



# ఊరి కోసం ఒక్కరోజు, కమలాపూర్‌లో శ్రమదానం జోష్





**కలిసి కట్టుగా కదిలిన యువత,స్వచ్ఛ గ్రామం లక్ష్యంగా సర్పంచ్ పబ్బు సతీష్ పిలుపు**

**మన దునియా ప్రతినిధి కమలాపూర్**

కలిసి కట్టుగా కదులుదాం, ఊరును పరిశుభ్రంగా ఉంచుకుందాం" అనే నినాదంతో, కమలాపూర్ గ్రామంలో ఆదివారం నిర్వహించిన "ఊరి కోసం ఒక్కరోజు" శ్రమదానం కార్యక్రమం గ్రామంలో చైతన్యాన్ని నింపింది. గ్రామ పారిశుధ్య పరిరక్షణ లక్ష్యంగా హనుమకొండ జిల్లా కమలాపూర్ సర్పంచ్ పబ్బు సతీష్ ఆధ్వర్యంలో యువత, గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, పారిశుధ్య సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.గ్రామంలోని డ్రైనేజీలు, రోడ్లు శుభ్రం చేస్తూ స్వచ్ఛ కమలాపూర్ దిశగా గ్రామస్తులు శ్రమదానం నిర్వహించారు. ముఖ్యంగా కమలాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో 1994-95 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు, సర్పంచ్ క్లాస్‌మేట్స్, బాల్యమిత్రులు కలిసి రెండో వార్డులో శ్రమదానం చేయడం విశేషంగా నిలిచింది.ఈ సందర్భంగా సర్పంచ్ పబ్బు సతీష్ మాట్లాడుతూ గ్రామం పెద్దదిగా ఉండటం, పారిశుధ్య సిబ్బంది తక్కువగా ఉండటంతో పరిశుభ్రత పరిరక్షణ సవాలుగా మారిందన్నారు. గ్రామ పారిశుధ్య కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం పెంచాలనే ఉద్దేశంతో "ఊరి కోసం -- ఒక్కరోజు" కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు.మురుగు కాలువల శు



భ్రత, చెత్తాచెదారం తొలగింపు, మొక్కల సంరక్షణ వంటి అంశాలను ప్రధాన లక్ష్యంగా తీసుకుని ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధిని కోరుకునే ప్రతి యువకుడు, గ్రామస్తుడు వారంలో కనీసం ఒక రోజు గ్రామం కోసం కేటాయించాలని పిలుపునిచ్చారు."మన ఊరు.. మన బాధ్యత. అందరం కలిసి ముందుకు వస్తే కమలాపూర్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దగలం" అని సర్పంచ్ పబ్బు సతీష్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, యువకులు, గ్రామ పెద్దలు, మహిళలు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.


# పార్టీ పెట్టి ఉంటే కచ్చితంగా గెలిచేవాడిని: రజనీకాంత్

**మన దునియా,తమిళనాడు:మే 17**

సూపర్‌స్టార్ రజనీకాంత్ తాజాగా చేసిన రాజకీయ వ్యాఖ్యలు తమిళనాడులో చర్చనీయాంశంగా మారాయి. రాజకీయాల విషయంలో తనపై వస్తున్న అనేక ప్రచారాలపై ఆయన స్పందించారు. చెన్నైలో ఈరోజు(ఆదివారం) రజనీకాంత్ మీడియాతో మాట్లాడారు. తమిళనాడు ప్రజలు మార్పు కోరుకున్నారని పేర్కొన్నారు. అలాగే నటుడు విజయ్ సీఎం కావడం తనకు సంతోషమేనని వ్యాఖ్యానించారు. తనకు ఎవరిపైనా ద్వేషం లేదని స్పష్టం చేశారు. విజయ్ సీఎం కాకుండా అడ్డుకోవాలని తాను ఎప్పుడూ ప్రయత్నించలేదని స్పష్టం చేశారు. తాను పార్టీ పెట్టి ఉంటే కచ్చితంగా గెలిచేవాడినని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇకపై రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన లేదని స్పష్టం చేశారు.

**కమల్‌హాసన్ సీఎం అయితే అసూయపడతా**

తమిళనాడు మాజీ సీఎం ఎంకే స్టాలిన్‌ను ఇటీవల తాను కలిసిన విషయంపై కూడా రజనీకాంత్ స్పందించారు. ఆ భేటీలో ఎలాంటి రాజకీయ ఉద్దేశం లేదని తేల్చిచెప్పారు. స్టాలిన్ తనకు మంచి మిత్రుడని, స్నేహపూర్వకంగానే కలిశానని స్పష్టం చేశారు. ఈ సమావేశాన్ని రాజకీయ కోణంలో చూడొద్దని సూచించారు. కమల్‌హాసన్ సీఎం అయితే అసూయపడతానని చమత్కరించారు. విజయ్ తనకు సమవుజ్జీ అనుకోవడం లేదని తెలిపారు. అన్ని పార్టీల్లోనూ తనకు అభిమానులుంటారని పేర్కొన్నారు. రజనీకాంత్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం తమిళ రాజకీయాల్లో హాట్




టాపిక్‌గా మారాయి. ముఖ్యంగా విజయ్ రాజకీయ ప్రవేశం, తమిళనాడు భవిష్యత్తు ఎన్నికల నేపథ్యంలో రజనీ చేసిన వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. అభిమానులు, రాజకీయ వర్గాలు ఆయన వ్యాఖ్యలపై విభిన్నంగా స్పందిస్తున్నాయి.గతంలో రజనీకాంత్ రాజకీయాల్లోకి వస్తారని, పార్టీ స్థాపిస్తారని ప్రచారం జరిగినప్పటికీ చివరికి ఆయన అనారోగ్య కారణాలతో రాజకీయాలకు దూరంగా ఉంటానని ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పుడు మరోసారి రాజకీయాల్లోకి రానని స్పష్టం చేయడంతో ఆయన అభిమానుల్లో చర్చ మొదలైంది. తమిళనాడు రాజకీయాలపై రజనీకాంత్ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి..

# నీట్ పేపర్ లీక్.. 14 రోజుల సీబీఐ కస్టడీకి నిందితురాలు

**మన దునియా,న్యూఢిల్లీ:మే17**

నీట్ పేపర్ లీక్ కేసులో అరెస్టైన నిందితురాలు మనీషా మంధారే విచారణ కోసం కోర్టు ఆమెను 14 రోజుల పాటు సీబీఐ కస్టడీకి అనుమతిస్తూ తాజాగా ఆదేశాలు జారీ చేసింది. జీవశాస్త్ర నిపుణురాలైన ఆమెను సీబీఐ అధికారులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. ఇక లీకేజీ సూత్రధారి, నీట్ కమిటీలో రసాయనశాస్త్ర నిపుణుడిగా ఉన్న పీవీ కులకర్ణిని సీబీఐ శుక్రవారమే అరెస్టు చేసింది. నీట్ ప్రశ్నపత్రం రూపకల్పనలో సభ్యులుగా ఉన్న వారికి మొత్తం ప్రశ్నలు తెలిసే అవకాశం తక్కువగా ఉండటంతో ఇతర సబ్జెక్టుల నిపుణులతో కలిసి కులకర్ణి లీకేజీకి పాల్పడినట్టు సీబీఐ అధికారులు గుర్తించారు. ..పేపర్ లీకేజీలో మనీషా మంధారే కీలకంగా వ్యవహరించారని కోర్టుకు సీబీఐ తెలిపింది. బోటనీ, జువాలజీ ప్రశ్నపత్రాల అనువాదంలో ఆమె నిపుణురాలని పేర్కొంది. కులకర్ణితో పాటు మనీషా మంధేరే, మనీషా వాఘ్మరే ఈ కుట్రలో కీలక పాత్రధారులని తెలిపింది.ఈ కేసుకు సంబంధించి దేశవ్యాప్తంగా రెయిడ్స్, విచారణ జరుగుతున్నాయని న్యాయస్థానానికి సీబీఐ వెల్లడించింది. ఈ క్రమంలో మంధారేను విచారించేందుకు 14 రోజుల కస్టడీ కావాలని కోరింది. ఈ కేసుకు సంబంధించి వివిధ ప్రాంతాలకు ఆమెను తీసుకెళ్లి విచారించి, ఆధారాలు సేకరించాల్సిన అవసరం ఉందని పేర్కొంది..




# మంథనిలో పోలీసుల డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు!

**మన దునియా,పెద్దపల్లి జిల్లా:మే 17**



మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతిరోజు జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లో పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్,విషయమై ప్రత్యేకంగా తనిఖీలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆదివారం సాయంత్రం పెద్దపల్లి జిల్లా మంథని మండల కేంద్రంలో ఎస్ఐ డేగ రమేష్ ఆదేశాల మేరకు మంథని పట్టణంలోని పాత పెట్రోల్ బంక్ సమీపంలో ఏ ఎసై శ్రీనివాస్, ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్, తోపాటు.. వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడిపే వారి పట్ల మరింత కఠినంగా వ్యవహరిం చనున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లేఖించే వారి విషయంలో ఉపేక్షిం చుకోమని స్పష్టం చేశారు. ఈ తనిఖీలు ప్రతిరోజు చేపడతా మని ఆయన స్పష్టం చేశారు.

# మహబూబ్‌నగర్ జిల్లా వైష్ణవి హత్య కేసు.. నిందితుడి మృతి

**మన దునియా,మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల:మే17**



మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో చోటుచేసుకున్న ఘటన విషాదాన్ని మిగిల్చింది. వైష్ణవి(24) అనే యువతిని నిన్న(శనివారం) రాత్రి గొంతుకోసి హత్య చేసిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యువతిని హత్య చేసిన అనంతరం అక్కడే ఉన్న ప్రజలు ఆగ్రహంతో నిందితుడిపై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన యువకుడిని ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. వైష్ణవి హత్యకు గల కారణాలు ఏమిటి?, ఇద్దరి మధ్య పరిచయం ఏమైనా ఉందా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. యువతి హత్య, అనంతరం నిందితుడి మృతి స్థానికంగా తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులు పరిస్థితిని అదుపులో ఉంచేందుకు చర్యలు చేపట్టారు..

# వేటగాళ్ల విద్యుత్ ఉచ్చుకు బర్రె బలి!

**గుడి సమీప అడవుల్లో దారుణం.**

**బిజ్జ వెంకన్నకు చెందిన బర్రె విద్యుత్ ఉచ్చులో పడి మృతి.**

**తృటిలో తప్పిన పెద్ద ప్రమాదం.. సురక్షితంగా బయటపడ్డ తునికి ఆకు కూలీలు.**

**మన దునియా,గుంజేడు ముసలమ్మ:మే17**




మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గుంజేడు ముసలమ్మ దేవస్థాన పరిసర అడవుల్లో వేటగాళ్ల ఆగడాలు మితిమీరాయి. అడవి జంతువుల కోసం కొందరు కిరాతకులు అమర్చిన విద్యుత్ ఉచ్చులో పడి.. స్థానిక రైతు బిజ్జ వెంకన్నకు చెందిన బర్రె ప్రాణాలు కోల్పోయింది. తునికి ఆకు సేకరణ కోసం అడవిలోకి వెళ్లిన కూలీలకు ఈ బర్రె కళేబరం కనిపించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. లైవ్ కరెంట్ తీగలను గమనించిన కూలీలు అప్రమత్తం కావడంతో తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. సమీపంలో లభ్యం అయిన జంతు కలేబరం అధికారులు తక్షణమే స్పందించి వేటగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు."

# భగీరథ్ లొంగిపోయారు.. విచారణ రాష్ట్ర పోలీసుల పరిధిలోనే ఉంది: కిషన్‌రెడ్డి

**మన దునియా,హైదరాబాద్:మే 17**



బండి భగీరథ్ ఎపిసోడ్‌పై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పందించారు. భగీరథ్ పోలీసుల ఎదుట లొంగిపోయారని తెలిపారు. ఈకేసు విచారణ ఏదైనా ఉంటే పూర్తిగా తెలంగాణ పోలీసుల పరిధిలోనే ఉంటుందని స్పష్టం చేశారు. ఈరోజు (ఆదివారం) హైదరాబాద్ వేదికగా మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు. బండి సంజయ్ మంత్రి పదవిలో కొనసాగుతారా..? లేదా అనే దానిపై తాను కామెంట్ చేయలేనని చెప్పుకొచ్చారు. పచ్చిమబెంగాల్ పర్యటనలో భాగంగా అమిత్ షా, యోగి ఆదిత్యనాథ్‌లను ఆ రాష్ట్ర పోలీసులు గతంలో అడ్డుకున్నారని ప్రస్తావించారు. రాష్ట్ర ప్రభుత్వాలకు అంతటి స్వతంత్ర వ్యవస్థ ఉంటుందని.. భగీరథ విషయంలో ఎలాంటి విచారణ అయిన చేయొచ్చని కిషన్‌రెడ్డి తేల్చిచెప్పారు..

మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం పోరాటాలను మరింత బలోపేతం చేస్తాం

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం 3వ మండల మహాసభలో తీర్మానం







**ఖానాపూర్ ఆర్సి మన దునియా మే; 17.**

మంచిర్యాల జిల్లా జన్నారం మండలం పొనకల్ గ్రామంలోని సుందరయ్య నగర్‌లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం 3వ మండల మహాసభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ కనికరపు అశోక్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా గత మూడు సంవత్సరాల కాలంలో నిర్వహించిన ఉద్యమాలు, పోరాటాలపై సమగ్రంగా చర్చించి, భవిష్యత్తులో చేపట్టాల్సిన పోరాటాలు, కార్యక్రమాలపై పలు తీర్మానాలు చేశారు. కామ్రేడ్ కనికరపు అశోక్ మాట్లాడుతూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం భూమిలేని పేదలు, వ్యవసాయ కూలీలు, సన్నకారు రైతుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ప్రజా సంఘమని తెలిపారు. పెరుగుతున్న జీవన వ్యయాలు, ద్రవ్యోల్బనానికి అనుగుణంగా వ్యవసాయ కూలీలకు సరైన వేతనాలు కల్పించాలని గ్రామాల్లో ఉద్యమాలు, సమ్మెలు నిర్వహిస్తున్నామని అన్నారు. భూమిలేని పేదలు, దళితులు మరియు వ్యవసాయ కూలీలకు ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. మహాత్మా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని, ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపుతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అనేక పరిశ్రమలు మూతపడటంతో కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేసి అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కామ్రేడ్ కొండగుర్ల లింగన్న మాట్లాడుతూ ప్రభుత్వ భూములు పేదలకు పంపిణీ చేయాలని, రైతు భరోసా, భీమా వంటి ప్రభుత్వ పథకాలు వ్యవసాయ కూలీలకు కూడా అందేలా పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫారసులను అమలు చేసి అర్హులైన పేదలకు భూములు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఉద్యమాలను మరింత బలోపేతం చేసేందుకు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మగ్గిడి జయ, కార్యదర్శిగా గుడ్ల రాజన్న, ఉపాధ్యక్షులుగా కనికరపు గంగారాం, పర్ల కనకయ్య, దుర్గం లక్ష్మి, సహాయ కార్యదర్శులుగా ఒడిపల్లి ప్రమీల, మల్లేశ్వరి తదితరులతో కలిసి 13 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కామ్రేడ్ అంబటి లక్ష్మణ్, బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ మండల నాయకురాలు కోరుట్ల యశోద, వ్యవసాయ కార్మికులు మరియు సంఘ నాయకులు పాల్గొన్నారు.

## ప్రతిభ పురస్కార్ అవార్డ్స్ కార్యక్రమం చాలా మంచి ఉద్దేశంతో ఏర్పాటు చేస్తున్న చాలా అద్భుతమైనది...

**మన దునియా, సంగెం మే 17**

కేవలం చదువుతూనే వ్యక్తి సమాజం అభివృద్ధి చెందుతుంది, చదివే లక్ష్యం చదివే మార్గంతో విద్యార్థిని విద్యార్థులు ముందుకు సాగుతే విజయం తప్పకుండా వారిని వరిస్తుంది ప్రతిభ పురస్కార్ అవార్డ్స్ కార్యక్రమం నేను భాగస్వామ్యం తప్పకుండా అవుతానంటూ ఎన్నో పేద కుటుంబాలకు అండగా ఉన్న ప్రతి ఒక్కరిని ప్రేమగా పలకరించే మంచి మనసున్న...గాంధీనగర్ గ్రామ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన రావిపాటి వెంకటేశ్వరరావు గారు (తీ జ తీ గ్రూప్)

## ఎస్ ఎస్సి లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు ఘనంగా సన్మానం

**మన దునియా, వాజేడు ,మే 17 ములుగు**




జిల్లా వాజేడు మండలంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఆదివారం విద్యా విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి ఎస్ ఎస్సీ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు ఘనంగా సన్మానించారు 2025 –26 సంవత్సరంలో మండలములో ఉత్తమ ప్రతిభ కనబరిచిన తొలి ముగ్గురు విద్యార్థులు విద్యార్థునిలకు తల్లిదండ్రుల సమక్షంలో శాలువాతో సత్కరించి ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్తుకు స్పష్టమైన ప్రణాళిక తో కెరియర్ మార్గదర్శకత్వం విజయవంతమైన పునాది వేయాలని సూచించారు మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ విద్యార్థులే తమ భవిష్యత్తు నిర్మాణాన్ని నిర్మించుకోవాలని ఉన్నత స్థానాలకు ఎదగాలని సందర్భంగా గుర్తు చేశారు ఈ కార్యక్రమంలో విద్యార్థి తల్లిదండ్రులు మరియు ఉపాధ్యా యులు స్వరూప్ సింగ్ శ్రీకాంత్ పాల్గొన్నారు

# ఉప్పల్ చౌరస్తా మూసివేత..

**ఎలివేటెడ్ కారిడార్ పిల్లర్ నిర్మాణ పనుల్లో భాగంగా...**

**నేటి నుంచి తాత్కాలికంగా బంద్**

**మన దునియా,హైదరాబాద్, ఉప్పల్:మే17**



అత్యంత రద్దీగా ఉండే ఉప్పల్ చౌరస్తాను ఆదివారం నుంచి తాత్కాలికంగా మూసివేయనున్నారు. ఉప్పల్ విద్యుత్ జంక్షన్ ప్రాంతంలో ఎలివేటెడ్ కారిడార్ పిల్లర్ నిర్మాణ పనుల్లో భాగంగా అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం నుంచి ఉప్పల్ రింగ్ రోడ్ మీదుగా వరంగల్ వైపు వెళ్లే అన్ని రకాల వాహనాలను దారి మళ్లిస్తున్నా మని సూచించారు. జీహెచ్ఎంసీ కార్యాలయం పక్కనున్న వరంగల్ బస్టాప్‌ను ఇప్పటికే ఉప్పల్ నల్ల చెరువు కట్ట వద్దకు మార్చిన విషయం విదితమే.

ప్రత్యామ్నాయ మార్గాలు ఇలా..

హబ్సిగూడ నుంచి వరంగల్ వైపు వెళ్లే భారీ వాహనాలు హబ్సిగూడ చౌరస్తా నుంచి నాచారం, మల్లాపూర్, ఐవోసీ, చెంగిచర్ల మీదుగా వరంగల్ రహదారికి చేరుకోవాల్సి ఉంటుంది. చిన్న వాహనాలు ఉప్పల్ ఇందిరాగాంధీ పార్కునుంచి లిటిల్ ఫ్లవర్ వెనక దారి నుంచి వరంగల్ రహదారికి చేరుకోవచ్చు. వరంగల్ నుంచి ఉప్పల్ వైపు వచ్చే వాహనాలు ఉప్పల్ ఏషియన్ సినీ థియేటర్ ఎదుటి హెచ్ఎండీఏ రోడ్డు ద్వారా నాగోల్ రోడ్డుకు కలుపుతారు. ద్విచక్ర వాహనదారులు నాగోల్ మెట్రో పిల్లర్లు 812, 813 నుంచి ఉప్పల్, సికింద్రాబాద్ వైపు వెళ్లాల్సి ఉంటుంది.

అలాగే భారీ వాహనాలు...

అలాగే, భారీ వాహనాలు నాగోల్ బ్రిడ్జి కింద నుంచి యూ టర్న్ చేసుకుని తిరిగి ఉప్పల్ వైపు రావాలి. వరంగల్ వైపు వెళ్లేవారు హెచ్ఎండీఏ లే అవుట్ నుంచి వరంగల్ హైవేకు చేరుకోవాలి. హైదరాబాద్‌కు వచ్చే వరంగల్ బస్సులు, లారీలు, భారీ వాహనాలన్నీ ఓఆర్ఆర్ మీదుగా హయత్‌నగర్ మీదుగా నగరానికి చేరుకోవాల్సి ఉంటుంది.

# పబ్లిక్ గార్డెన్ హా..? రొమాన్స్ అడ్డానా..?

**వాకింగ్‌కు వెళ్లిన ప్రజలకు అసహనం... అసభ్య ప్రవర్తనపై ఆగ్రహం**

**మన దునియా,హన్మకొండ:మే17**



హనుమకొండ నగరంలోని పబ్లిక్ గార్డెన్‌లో సాయంత్రం వేళ పరిస్థితులు రోజురోజుకూ వివాదాస్పదంగా మారుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్‌కు వచ్చే అధికారులు, మహిళలు, వృద్ధులు..అయితే అక్కడ కొందరు ప్రేమ జంటల అసభ్య ప్రవర్తనతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని వాకర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్క్‌లోని ట్రాక్‌లపై ప్రజలు నడుస్తుండగానే, కొందరు జంటలు బహిరంగంగా అభ్యంతరకరంగా ప్రవర్తిస్తున్నారని వాకర్స్ ఆరోపిస్తున్నారు.

“ఇది పబ్లిక్ గార్డెన్‌నా..? లేక రొమాన్స్ పార్క్‌నా..?” అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

ప్రత్యేకంగా సాయంత్రం వేళల్లో పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారుతోందని, పార్క్‌లోకి వచ్చే మహిళలు, చిన్నపిల్లలతో వచ్చిన కుటుంబాలు ఇబ్బందిగా ఫీలవుతున్నాయని చెబుతున్నారు. పబ్లిక్ ప్రదేశం అన్న కనీస బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్న వారిపై అధికారులు, పోలీసులు ఎందుకు దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వాకింగ్ కోసం వచ్చే ప్రజలకు ప్రశాంత వాతావరణం కల్పించాల్సిన చోట, అసహజ దృశ్యాలు కనిపించడం వల్ల చాలా మంది అసహనం వ్యక్తం చేస్తున్నారు. “పార్క్‌లో కూర్చోవడం తప్పు కాదు... కానీ పబ్లిక్ ప్రదేశంలో హద్దులు దాటే ప్రవర్తన సమాజానికి తప్పు సంకేతాలు ఇస్తోంది” అని కొందరు వృద్ధులు అభిప్రాయపడు తున్నారు. ఇప్పటికైనా పోలీసులు, మున్సిపల్ అధికారులు సాయంత్రం వేళల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అవసరమైతే కౌన్సిలింగ్ నిర్వహించి, పబ్లిక్ ప్రదేశాల్లో మర్యాదపూర్వక ప్రవర్తనపై అవగాహన కల్పించాలని సూచిస్తున్నారు.

# బండి భగీరథ్ కేసులో హైకోర్టు జడ్జిపై ట్రోలింగ్.. కేసు నమోదు

**మన దునియా,హైదరాబాద్,మే17**

పోక్సో కేసులో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ అరెస్టయ్యారు. అతడికి ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే మహిళాజడ్జి జస్టిస్ మాధవీ దేవిపై సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ ఆరోపణలపై చార్మినార్ పోలీసులకు తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి.. చార్మినార్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోక్సో కేసులో నిందితుడైన బండి భగీరథ్ అరెస్ట్‌కు రంగం సిద్ధమైంది. దీంతో అతడు ముందస్తు బెయిల్, అరెస్ట్ నుంచి రక్షణ కోసం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. వీటిని హైకోర్టు కొట్టివేసిన సంగతి తెలిసిందే. .. అయితే ఈ కేసు విచారణలో బండి భగీరథ్‌కి ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే.. జస్టిస్ మాధవీ దేవి భర్తకు బార్ కౌన్సిల్ చైర్మన్ పోస్ట్ ఇస్తారంటూ సోషల్ మీడియాలో కామెంట్లు వెల్లువెత్తాయి. ఈ బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా ఈ అంశాలను మహిళా జడ్జి జస్టిస్ మాధవీ దేవి స్వయంగా ప్రస్తావించినట్లు తెలుస్తోంది. దీని వల్ల న్యాయ వ్యవస్థపై ప్రజలకు అపనమ్మకం ఏర్పడుతుందని హైకోర్టు రిజిస్ట్రార్ వ్యాఖ్యానించారు. మహిళా జడ్జి జస్టిస్ మాధవీ దేవిని లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో చేసిన విమర్శలను ఆధారాలతో సహా చార్మినార్ పోలీసులకు హైకోర్టు రిజిస్ట్రార్ అందజేసి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరోవైపు బండి భగీరథ్ పోక్సో కేసులో బాధిత బాలిక, ఆమె తల్లిదండ్రుల ఫొటోలు, వీడియోలు వైరల్ చేసిన వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. కొన్ని సోషల్ మీడియా చానళ్లు.. బాధిత కుటుంబ వివరాలన బహిర్గతమయయ్యేలా.. ఫొటోలు, వీడియోలు ప్రసారం చేశాయి. ఇవి వైరల్‌గా మారడంతో మేడ్చల్––మల్కాజ్‌గిరి జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలిక, ఆమె కుటుంబ వివరాలు బహిర్గతం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని పోలీసు ఉన్నతాధికారులు హెచ్చరించారు. ఇప్పటికే పలు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ అకౌంట్లను గుర్తించి అందుకు సంబంధించిన యూఆర్ఎల్‌లను ఉన్నతాధికారులకు పంపించారు. ఖాతాలను నిర్వహిస్తున్న వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకునేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. బాధితురాలి గోప్యతకు భంగం కలిగిస్తే శిక్ష తప్పదని పోలీసులు హెచ్చరించారు. సోషల్ మీడియాలో ఇలాంటి పోస్టులను షేర్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు..



# శీర్షిక: ఉచితాల సంస్కృతి వర్సెస్ ఉపాధి కల్పన: సామాన్యుడి బతుకు చిత్రం - దేశ ఆర్థిక భవిష్యత్తు

**మన దునియా,వెంకటాపురం:మే17**

తెలంగాణ:ప్రస్తుతం దేశవ్యాప్తంగా నడుస్తున్న 'ఉచిత పథకాల' రాజకీయం, మరోవైపు ఆకాశాన్నంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలు సామాన్య పౌరుడి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఓట్ల వేటలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుప్పిస్తున్న ఉచితాలు తాత్కాలిక ఉపశమనాన్ని ఇస్తున్నప్పటికీ, అవి దేశ ఆర్థిక పునాదులను, సామాన్యుడి కొనుగోలు శక్తిని దీర్ఘకాలంలో ఎలా దెబ్బతీస్తున్నాయనే అంశంపై తెలంగాణ సమాజంలో తక్షణ చర్చ జరగాల్సిన అవసరం ఉంది.

1. పెరిగిన జీవన వ్యయం -- కరిగిపోతున్న సామాన్యుడి ఆదాయం

ప్రస్తుతం మార్కెట్‌లో పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలిండర్ ధరలతో పాటు పప్పులు, నూనెలు, కూరగాయల ధరలు సామాన్యుడికి అందుబాటులో లేకుండా పోయాయి. అంతర్జాతీయ యుద్ధాలు, ఇంధన కొరత వంటి కారణాలను కేంద్ర ప్రభుత్వం చూపుతున్నప్పటికీ, రవాణా ఖర్చులు పెరగడం వల్ల పడే భారం అంతా సామాన్యుడి వీపునే విరుగుతోంది. కష్టానికి తగ్గ ఆదాయం పెరగకపోవడం, కానీ నిత్యావసరాల ఖర్చులు రెట్టింపు అవ్వడంతో మధ్యతరగతి, పేద కుటుంబాలు ఒక పూట తిని, ఒక పూట పస్తులుండాల్సిన పరిస్థితులు వస్తున్నాయి.

2. ఉచిత పథకాలు: ఆర్థిక మాన్యానికి హేతువులా?

దేశంలో విద్యా, వైద్యం, వ్యవసాయం, వృద్ధాప్య/దివ్యాంగుల పెన్షన్లు వంటివి కచ్చితంగా అందించాల్సిన సామాజిక సంక్షేమ బాధ్యతలు. కానీ, వీటికి భిన్నంగా ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఉత్పాదకత లేని ఉచితాలు---వివిధ రాష్ట్రాల్లో ఇస్తున్న అపరిమిత ఉచిత విద్యుత్, అందరికీ ఉచిత బస్సు ప్రయాణాలు, నెలవారీ నగదు బదిలీలు---ప్రభుత్వ ఖజానాలను ఖాళీ చేస్తున్నాయి. తెలంగాణ సహా పలు రాష్ట్రాలు ఈ పథకాల కోసం వేల కోట్ల రూపాయలు అప్పులు తెస్తుండటంతో, ఆ అప్పుల వడ్డీల భారం మళ్లీ పరోక్ష పన్నుల,కరెంట్ ఛార్జీల పెంపు, రిజిస్ట్రేషన్ ఫీజులు, వ్యాట్ రూపంలో సామాన్యుడిపైనే పడుతోంది. ఒక్క చేత్తో ఉచితాలు ఇచ్చి, మరో చేత్తో పన్నుల రూపంలో ప్రజల జేబులు కత్తరిస్తున్నారనేది బహిరంగ రహస్యం.

3. భారతదేశం మరో శ్రీలంక అవుతుందా?

ప్రజల్లో ఒక భయం పొంచి ఉంది---"భారత్ మరో శ్రీలంకలా మారుతుందా?" అని. ఆర్థిక నిపుణుల ప్రకారం భారతదేశం వద్ద బలమైన విదేశీ మారక నిల్వలు మరియు అవసరానికి మించిన ఆహార ధాన్యాల నిల్వలు ఉన్నందున కేంద్ర ప్రభుత్వం దివాళా తీసే పరిస్థితి రాదు. కానీ, రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్పాదక వ్యయాన్ని పక్కన పెట్టి కేవలం ఉచితాలకే మొగ్గు చూపితే, రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలు అప్పుల ఊబిలో కూరుకుపోయి, భవిష్యత్తు తరాలకు అభివృద్ధి లేని శూన్యం మిగులుతుంది.




4. కావాల్సింది "చేపలు ఇవ్వడం కాదు... చేపలు పట్టడం నేర్పడం"

ఒక కుటుంబానికి నెలకు ఉచితంగా కొంత నగదు ఇవ్వడం కంటే, ఆ ఇంట్లోని యువతకు సరైన నైపుణ్య శిక్షణ ఇచ్చి ఐటీ, తయారీ, పారిశ్రామిక రంగాలలో ఉపాధి కల్పించడం మిన్న. అమెరికా, సింగపూర్, జపాన్ వంటి దేశాలు ప్రజలకు ఉచితాలు పంచలేదు; బలమైన మౌలిక వసతులు, పరిశ్రమలు స్థాపించి ఉద్యోగాలు సృష్టించాయి. ప్రభుత్వాలు సంక్షేమ బడ్జెట్‌ను పరిశ్రమల స్థాపనకు, సాగునీటి ప్రాజెక్టులకు, శాశ్వత సంపద సృష్టికి (Asset Creation) మళ్లించినప్పుడే రూపాయి విలువ పెరుగుతుంది, నిరుద్యోగం అంతమవుతుంది.

మేల్కొనాల్సిన సమయం ఆసన్నమైంది (ప్రభుత్వాలకు, ప్రజలకు విజ్ఞప్తి):

ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరియు ఓటర్లయిన ప్రజలందరూ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం. కేంద్ర ప్రభుత్వానికి విన్నపం: అంతర్జాతీయ కారణాలను సాకుగా చూపకుండా ఇంధన ధరలపై పన్నులను తగ్గించి, నిత్యావసరాల ధరలను అదుపు చేయాలి. దేశీయంగా ఉపాధి రంగాలను బలోపేతం చేయాలి.రాష్ట్ర ప్రభుత్వాలకు (తెలంగాణ సహా అన్ని రాష్ట్రాలకు) విన్నపం: ఉచితాల సంస్కృతిని వీడి, ఉపాధి కల్పనపై బడ్జెట్ కేటాయింపులు పెంచాలి. అప్పుల భారాన్ని తగ్గించి ఆర్థిక క్రమశిక్షణను పాటించాలి. ప్రజలకు విజ్ఞప్తి: తాత్కాలిక ఉచితాలకు ఆశపడి దేశ/రాష్ట్ర భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేసే నాయకులను కాకుండా, శాశ్వత అభివృద్ధిని, యువతకు ఉపాధిని ఇచ్చే పాలకులను ప్రశ్నించి ఎన్నుకోవాలి."అభివృద్ధి లేని సంక్షేమం దేనికీ కొరగాదు. సంక్షేమం – అభివృద్ధి సమతుల్యంగా సాగినప్పుడే సామాన్యుడి బతుకు మారుతుంది."

వ్యాస కర్త/సామాజిక విశ్లేషకులు
జాడి ఈశ్వర్ నేతకాని.
సెల్ నెంబర్: 9553436766.

# అటవీ సంపదను దోచుకుంటున్నారు.. ఆదివాసీలను వదిలేశారు: ప్రొఫెసర్ హరగోపాల్..

**మన దునియా,హనుమకొండ:మే 17**



హనుమకొండ: భారతదేశ స్వాతంత్ర్యానికి ముందు నుంచే ఆదివాసీలు తమ హక్కుల కోసం పోరాటాలు చేస్తున్నారని పౌర హక్కుల ఉద్యమ నేత, ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ఆదివాసీల చరిత్ర అంతా పోరాటమయం అని చెప్పారు. అడవులను కాపాడేందుకు వారు ఇప్పటికీ పోరాటాలు చేస్తూనే ఉన్నారని ఆయన పేర్కొన్నారు.హనుమకొండలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఐక్యత సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ హరగోపాల్, తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక కన్వీనర్ ప్రొఫెసర్ వెంకట నారాయణ, ఆదివాసీ హక్కుల రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్, ఆదివాసీ సంఘాల నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ.. ఆదివాసీల పట్ల పాలకులు వివక్ష చూపుతున్నారని అన్నారు. అభివృద్ధి కంటే అణచివేతనే కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి హామీలు ఇచ్చారే కానీ, పాలకులు ఏనాడూ వాటిని అమలు చేయలేదని ఆరోపించారు. అటవీ సంపదను దోచుకుపోతున్న వారే తప్ప, ఆదివాసీలకు భరోసా ఇచ్చే వారు లేకుండా పోతున్నారని చెప్పారు.ఖనిజ సంపదను తరలించుకుపోతున్నారే కానీ, అడవి బిడ్డల అభ్యున్నతిని విస్మరిస్తున్నారని హరగోపాల్ మండిపడ్డారు. పెట్టుబడిదారులకు పాలకులు కొమ్ముకాస్తున్నారని, ఆదివాసీలను అణచివేతకు గురిచేస్తున్నారని ఆగ్రహించారు. ఆదివాసీలందరూ ఎలాంటి స్వార్థం లేని వారని, అందుకే అడవులు అంతరించిపోకుండా కాపాడుతున్నారని ఆయన పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి ఆదివాసీలు అందరూ సంఘటితమై పాలకులను నిలదీయాలని ప్రొఫెసర్ హరగోపాల్ పిలుపునిచ్చారు..

# హన్మకొండ:దీర్ఘకాలిక కీళ్ళ వాతం పై అవగాహన కార్యక్రమం



**మన దునియా,హన్మకొండ:మే17**

హన్మకొండ లోని అపెక్స్ సెంటర్ ఫర్ రుమాటలజీ హాస్పిటల్ లో డాక్టర్ విఘ్నేష్ రుమాటలాజిస్ట్ మరియు సోషల్ వర్కర్ నాగరాజు ఆధ్వర్యంలో "లూపస్" వ్యాధి వచ్చిన వారికీ ఎదురయ్యే వివిధ రకాల సమస్యల నుండి రక్షించుకోవడం కోసం అవగాహనా కల్పించరు. లుపాస్ వ్యాధి పైనే కాకుండ అన్ని రకాల కీళ్ళవాతం మరియు కీళ్ళ వాతం వున్నవారికి ఎదురయ్యే ఇతర సమస్యలు రుమాటలజీ పై అపోహలు ఉనిజాలు, శరీరక వ్యాయామం,సూర్య రష్మీ నుండి రక్షణ,ఆకలి తగ్గడం,అజిర్ణం,జుట్టురాలడం, ఆహారల నియమాలను వివరించి చెప్పడం జరిగింది.డాక్టర్ విగ్నేష్ మాట్లాడుతు వ్యాధిని అదుపులో ఉంచుతూ ఆరోగ్యాంగా జీవించడానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మీకు ఎదురయ్యే సమస్య ల పరిష్కారం కోసం ప్రోజెక్టర్ ద్వారా మీకు స్క్రీన్ పై చూపిస్తూ నేను మరియు స్టాఫ్ మీకు అర్థం అయ్యే విదంగా వివరించడం సంతోషంగా ఉందని ఇప్పుడే కాకుండా మీకెప్పుడు సమస్యలు ఎదురైనా సలహాల కోసం సోషల్ వర్కర్, ఫిజియో తెరఫీస్ట్ అందుబాటులో ఉండి సలహాలు ఇచ్చి పరిష్కరిస్తమని చెప్పరు .కార్యక్రమం లో హాస్పిటల్ సిబ్బంది, యాజమాన్యం కార్తీక్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేటలో ఘనంగా జిల్లాస్థాయి విద్యావిజయోత్సవం

**ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేసిన కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**వచ్చే ఏడాది ప్రభుత్వ బడుల్లో 10శాతం అడ్మిషన్లు పెంచడమే లక్ష్యం**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన '99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా నిర్వహించిన విద్యా వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లాస్థాయి విద్యా విజయోత్సవం సంబరాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ మరియు క్రీడా (స్పోర్ట్స్) విభాగాల్లో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఈ సందర్భంగా కలెక్టర్ ఘనంగా సత్కరించారు. ప్రతి విభాగంలో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు రూ. 10,000 నగదు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు విద్య యొక్క ఆవశ్యకతను గుర్తించి, భవిష్యత్తులో వచ్చే ఆధునిక అవకాశాలను అందిపుచ్చు కోవాలని పిలుపునిచ్చారు. మారుతున్న సమాజానికి అనుగుణంగా నైపుణ్యాలను పెంచుకోవాలని, క్రమశిక్షణ, ఏకాగ్రతతో కూడిన పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు పాఠశాల విద్యాశాఖను కలెక్టర్ అభినందించారు. ఇదే ఉత్సాహంతో వచ్చే విద్యా సంవత్సరానికి గానూ 'బడిబాట' కార్యక్రమంలో ప్రతి ప్రభుత్వ పాఠశాలలో కనీసం 10 శాతం కొత్త అడ్మిషన్లను పెంచేలా ఉపాధ్యాయులందరూ ప్రత్యేక కార్యాచరణ రూపొందించు కోవాలని ఆదేశించారు. ఈ విజయోత్సవ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి కే. అశోక్, డీఐఈవో సులోచన రాణి, సెక్టోరియల్ అధికారులు హరికృష్ణ, సూర్యనారాయణ, పూలన్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు వనమాల వెంకటేశ్వర్లుతో పాటు వివిధ మండలాల ఎంఈఓలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు

# సూరవేడు సమీపంలో కల్వర్టును ఢీ కొట్టిన ట్రాక్టర్ డ్రైవర్ కు తీవ్ర గాయాలు

**మన దునియా ,వాజేడు ,మే 17**



ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఎదిర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సూరవేడు కాలనీ సమీపంలో ఆదివారం సాయంత్రం ట్రాక్టర్కు కల్వర్టుఢీ కొట్టి ప్రమాదానికి గురైంది ఢీకొన్న అనంతరం వాహనం అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకువెల్లగా ట్యలీ బోల్తా పడింది ఈ ప్రమాదంలో డ్రైవరు తీవ్రంగా గాయపడగా కాలు విరిగినట్లు సమాచారం విషయం తెలుసుకున్న ఏదిరా 108 అంబులెన్స్ ఈ ఎంటి రాజ్ కుమార్ పైలెట్ కృష్ణ సంఘటనకు చేరుకొని బాధితులను ప్రాథమిక చికిత్స అందించి చర్ల గవర్నమెంట్ హాస్పటల్ కి తరలించారు

# వాజేడు మండలం టేకులగూడెం గ్రామం చతిస్గడ్ బోర్డర్ లో వెలిసిన బిరమయ్య (భీష్మ శంకరుడు) ఆదివారం కావడంతో భక్తులతో సందడి మొదలైంది







**మన దునియా, వాజేడు, మే 17**

చతిస్గడ్ బోర్డర్ లో ఉన్న బీరమ్మయ గుడి వద్ద ఆదివారం కావడంతో భక్తులు కోళ్ల మేకలతో సన్నాయి మేళాలతో అట్ట హాసంగా బయలుదేరి వారి మొక్కలు చెల్లించుకున్నారు భీరమాయ్య దేవుడి ప్రత్యేకత అక్కడికి వెళ్లినవారు ఏది మనసులో కోరుకుంటూ అది జరుగుతుందని భక్తులు నమ్మకం ఈ గుడికి ఆదివారం నలుమూలల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో రావడం విశేషంగా కనిపించింది వారికి అన్ని రకాల మంచి జరగడంతో మొక్కలు చెల్లించుకోవడానికి రావడం విశేషంగా కనిపించి భక్తిశ్రద్ధలతో దేవుడు సన్నిధిలో కూర్చొని ఫలహారం తీసుకొని వంట వార్పు చేసుకుని చక్కని అడవి మధ్యలో చక్కని వాతావరణం ఎంజాయ్ చేశారు దేవుడు సన్నిధికి వెళ్లి అక్కడ మనసులో ఏది కోరుకుంటే అది జరుగుతుందని తాత ముత్తాతల నుండి వచ్చే ఆచార విధానంతో అక్కడికి వెళ్తున్నారు

మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## సెర్వైకల్ నొప్పితో బాధపడుతున్నారా?



ఈ డిజిటల్ యుగంలో చాలా మంది గంటల తరబడి కంప్యూటర్, ల్యాప్‌టాప్ లేదా మొబైల్‌పై పని చేస్తారు. దీని వల్ల మెడ, భుజాలపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ కారణంగా చాలా మంది సెర్వైకల్ స్పాండిలైటిస్ లేదా మెడ నొప్పి సమస్యను ఎదుర్కొంటారు. ఈ డిజిటల్ యుగంలో చాలా మంది గంటల తరబడి కంప్యూటర్, ల్యాప్‌టాప్ లేదా మొబైల్‌పై పని చేస్తారు. దీని వల్ల మెడ, భుజాలపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ కారణంగా చాలా మంది సెర్వైకల్ స్పాండిలైటిస్ లేదా మెడ నొప్పి సమస్యను ఎదుర్కొంటారు. మెడలో బిగుసుకుపోవడం, భుజాలలో ఒత్తిడి, తలనొప్పి, వీపు నొప్పి వంటివి సెర్వైకల్ లక్షణాలుగా ఉండవచ్చు. సెర్వైకల్ నొప్పిని తగ్గించడానికి మీరు కొన్ని వ్యాయామాల సహాయం తీసుకోవచ్చు. ఈ వ్యాయామం మెడ బిగుసుకుపోవడాన్ని తగ్గిస్తుంది. కండరాలను సడలిస్తుంది. ఈ వ్యాయామం చేయడానికి నిటారుగా కూర్చోండి లేదా నిలబడండి. ఆ తర్వాత మెడను నెమ్మదిగా ముందుకు వంచండి. ఆపై వెనుకకు వంచండి. ఈ ప్రక్రియను 5 నుండి 10 సార్లు చేయండి. దీని వల్ల సెర్వైకల్ నొప్పి తగ్గవచ్చు. ఇది మెడ సౌలభ్యాన్ని పెంచుతుంది. రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఈ వ్యాయామం చేయడానికి తలను నెమ్మదిగా కుడి వైపుకు తిప్పండి. కొన్ని సెకన్ల పాటు ఆపండి. ఆ తర్వాత తలను ఎడమ వైపుకు తిప్పండి. రెండు దిశలలో ఒక్కొక్కటి 5 సార్లు చేయండి. ఇది మెడ పక్కని కండరాలకు ఉపశమనం కలిగిస్తుంది. తలను నెమ్మదిగా కుడి వైపుకు వంచండి (చెవిని భుజం వైపు తీసుకురండి). 10 సెకన్ల పాటు ఆపండి. ఆపై ఎడమ వైపుకు పునరావృతం చేయండి. ఈ ప్రక్రియను 3-4 సార్లు చేయండి. ఈ భంగిమ మీ మెడ స్థానాన్ని మెరుగుపరుస్తుంది. సెర్వైకల్ నొప్పిని తగ్గిస్తుంది. దీన్ని చేయడానికి మీ వీపు, మెడను నిటారుగా ఉంచండి. ఆపై గడ్డాన్ని మెడ వైపు నెమ్మదిగా లోపలికి లాగండి. 5 సెకన్ల పాటు ఆపి, ఆ తర్వాత సాధారణ స్థితికి తిరిగి వెళ్లండి. దీన్ని 10 సార్లు పునరావృతం చేయండి.

## బీపీతో ఇబ్బందిపడుతున్నారా?

రక్తపోటు రోగులు తరచుగా బలహీనతను అనుభవిస్తారు. అలాంటి సమయాల్లో అరటిపండు శరీరానికి ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి సహజ చక్కెర ద్వారా శక్తిని అందిస్తుంది. అరటిపండు.. ప్రతి సీజన్‌లో ప్రతిచోటా సులభంగా లభించే పండు. ఇది ఒక సూపర్ ఫుడ్. వైద్యుల నుండి డైటీషియన్ల వరకు అందరూ రోజూ తినాలని సిఫార్సు చేస్తారు. ముఖ్యంగా బిపి రోగులకు ఇది ఒక దివ్యౌషధం లాంటిది. బీపీ రోగులు రోజూ ఒక అరటిపండు తినాలని వైద్యులు సలహా ఇస్తారు. వైద్యులు ఇచ్చిన ఈ చిన్న సలహా అధిక రక్తపోటు రోగుల జీవితాన్ని మార్చగలదు. అయితే బీపీ ఉన్నవారికి అరటిపండు ఎందుకు అంత ప్రత్యేకమైనదో? అరటిపండులో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది సోడియంను సమతుల్యం చేస్తుంది. రక్తపోటును సహజంగా నియంత్రిస్తుంది. అధిక బీపీకి పొటాషియం సహజ శత్రువు అని వైద్యులు అంటున్నారు. ఒక మధ్య తరహా అరటిపండులో దాదాపు 422ఎస్త్ర పొటాషియం ఉంటుంది. అమెరికన్ జర్నల్ ఆఫ్ ఫిజియాలజీ-రీనల్ ఫిజియాలజీలో ప్రచురితమైన ఒక కొత్త అధ్యయనంలో అధిక పొటాషియం తీసుకోవడం అనుకరణ కాలియురేసిస్, నాట్రియురేసిస్, బీపీని గణనీయంగా తగ్గిస్తుందని కనుగొంది. ఎక్కువ సోడియంతో కూడా ప్రయోజనాలను పొందవచ్చు. రక్తపోటు రోగులు తరచుగా బలహీనతను అనుభవిస్తారు. అలాంటి సమయాల్లో అరటిపండు శరీరానికి ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి సహజ చక్కెర ద్వారా శక్తిని అందిస్తుంది. అది కూడా ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా. అందుకే దీనిని సూపర్ ఫుడ్ అని పిలుస్తారు. బీపీ రోగులకు ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. అరటిపండును ఒక పరిపూర్ణ ఆరోగ్య చిరుతిండిగా పరిగణిస్తారు. అరటిపండు రుచికరమైనది మాత్రమే కాదు తక్కువ కేలరీలు, అధిక పోషకాలు కలిగిన పండు కూడా. మీరు దీన్ని ఉదయం ఎప్పుడైనా తినవచ్చు. స్నాక్స్ సమయంలో లేదా నడక తర్వాత. దీనివల్ల శరీరానికి మంచి శక్తి, పోషకాలు లభిస్తాయి. అరటిపండ్లలో ఉండే విటమిన్ బి6, మెగ్నీషియం రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. ఒత్తిడిని తగ్గించడంలో కూడా సహాయపడతాయి. ప్రతిరోజూ ఒక అరటిపండు తినడం వల్ల మనసు కూడా రిలాక్స్‌గా ఉంటుంది. దీనివల్ల అనేక సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. అరటిపండులో ఉండే డైటరీ ఫైబర్ రక్తపోటును నియంత్రించడంలో సహాయపడటమే కాకుండా కొలెస్ట్రాల్‌ను సమతుల్యం చేస్తుంది. ఇది మీ గుండె ఆరోగ్యానికి బూస్టర్‌గా కూడా పనిచేస్తుంది.



# కొలెస్ట్రాల్ ఉన్న వారు నెయ్యి తినవచ్చా..?

నెయ్యి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. నెయ్యిలో పోషకాలతో పాటు ఔషధ గుణాలు పుష్కలంగా దాగున్నాయి.. నెయ్యి తీసుకోవడం వల్ల శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. నెయ్యిలో అనేక విటమిన్లు, కాల్షియం, పొటాషియం ఉన్నాయి. ఇది కాకుండా, నెయ్యిలో ఆరోగ్యకరమైన కొవ్వులు కూడా ఉన్నాయి. నెయ్యి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. నెయ్యిలో పోషకాలతో పాటు ఔషధ గుణాలు పుష్కలంగా దాగున్నాయి.. నెయ్యి తీసుకోవడం వల్ల శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. నెయ్యిలో అనేక విటమిన్లు, కాల్షియం, పొటాషియం ఉన్నాయి. ఇది కాకుండా, నెయ్యిలో ఆరోగ్యకరమైన కొవ్వులు కూడా ఉన్నాయి. శరీరానికి శక్తి రావాలంటే నెయ్యి తినాలని నిపుణులు చెబుతున్నారు. నెయ్యి జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.. చర్మం, జుట్టు సమస్యలను కూడా నయం చేస్తుంది. నెయ్యి పోషకాలకు పవర్ హౌస్‌గా పేర్కొంటారు. శరీరానికి ఎంతో అవసరమైన విటమిన్-ఎ, విటమిన్-ఇ, విటమిన్-బి విటమిన్ కే తోపాటు విటమిన్ డి పుష్కలంగా ఉంటాయి.. అంతేకాకుండా.. ఒమేగా -3, ఒమేగా-6 వంటి ఫ్యాటీ యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్లు, లినోలిక్, బ్యుటిరిక్ యాసిడ్స్ వంటి పోషకాలు ఉన్నాయి. నెయ్యిలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. అయితే, ప్రస్తుత కాలంలో కొలెస్ట్రాల్‌తోపాటు ఎన్నో అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి.. ఇలాంటి పరిస్థితుల్లో కొలెస్ట్రాల్ సమస్యలు ఉన్నవారు నెయ్యిని తినవచ్చా.. లేదా..? తింటే ఏమవుతుంది..? ఒకవేళ తింటే ఎంత తినాలి.. అనే ప్రశ్నలు సాధారణంగా ప్రతి ఒక్కరినీ వెంటాడుతున్నాయి. ఆయుర్వేదంలో ఔషధ వినియోగం: నెయ్యిలోని పోషకాలు, విశిష్ట లక్షణాల కారణంగా ఆయుర్వేదంలో ఔషధంగా ఉపయోగిస్తారు. నెయ్యి శరీరంలో మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతూ చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుందని పేర్కొంటున్నారు ఆయుర్వేద నిపుణులు..కొలెస్ట్రాల్ సమస్య ఉన్నవారు కూడా నెయ్యి తినవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు.. అయితే.. రోజుకు కేవలం 2 నుంచి 3 స్పూన్లు నెయ్యి మాత్రమే తీసుకోవడం మంచిది.. అంతకు మించి నెయ్యి తీసుకోకూడదని పేర్కొంటున్నారు.కాబట్టి శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పెరగకుండా జాగ్రత్తపడాలి. చెడు కొలెస్ట్రాల్ పెరగడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని పేర్కొంటున్నారు.. కొలెస్ట్రాల్ ఉన్నవారు ముందుగా వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకుని.. వారి సూచనల ప్రకారం.. నెయ్యిని తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.



## వెల్లుల్లి పరిమితి దాటి తింటే అనారోగ్య సమస్యలు తప్పవు

వెల్లుల్లిని ఆయుర్వేదం ప్రకారం సర్వ రోగ నివారిణిగా పిలుస్తారు. ముఖ్యంగా వెల్లుల్లి లేకుండా ఏ భారతీయ వంటకం ఉండదంటే అతిశయోక్తి కానేకాదు. వెల్లుల్లి కేవలం రుచి కోసమే కాకుండా..ఆరోగ్యపరంగా కూడా చాలా లాభదాయకం. ప్రతి భారతీయుని కిచెన్‌లో తప్పకుండా లభించే పదార్థం వెల్లుల్లి, సాధారణంగా వెల్లుల్లిని తాలింపు కోసం లేదా వంటల రుచి కోసం ఉపయోగిస్తుంటారు. అయితే అంతకుమించిన ఆరోగ్య ప్రయోజనాలు వెల్లుల్లిలో దాగున్నాయి. అందుకే తల్లి చేసే మేలు వెల్లుల్లి కూడా చేయదంటారు. కానీ వెల్లుల్లిని మోతాదుకు మించి తినకూడదంటారు. పరిమితి దాటితే వెల్లుల్లితో అనర్థాలే ఎక్కువ. ఆ వివరాలు మీ కోసం..వెల్లుల్లిని ఆయుర్వేద శాస్త్రంలో ఆరోగ్య ఖజానాగా పిలుస్తారు. ఎందుకంటే వెల్లుల్లిలోని పోషక పదార్థాలు చాలా ఎక్కువ. ఇందులో విటమిన్ బి1, కాల్షియం, కాపర్, పొటాషియం, ఫాస్పరస్, ఐరన్ వంటి న్యూట్రియంట్లు ఉన్నాయి. అయితే మోతాదు దాటకూడదు. వెల్లుల్లి మోతాదు దాటి తినడం వల్ల ఛాతీలో మంట సమస్య ఏర్పడుతుంది. దీనికి కారణం వెల్లుల్లిలో ఎసిడిక్ కాంపౌండ్ ఎక్కువగా ఉండటం. ఈ మంట చాలా సందర్భాల్లో భరించలేకుండా ఉంటుంది.వెల్లుల్లితో రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. అందుకే లో బీపీ రోగులు వెల్లుల్లి తీసుకోకూడదు. వెల్లుల్లి అతిగా తీసుకుంటే హైపర్ టెన్షన్ సమస్య ఏర్పడవచ్చు. శరీరంలో విపరీతమైన అలసట ఉంటుంది. వెల్లుల్లి స్వభావం వేడి చేసేది కావడంతో వేసవిలో వెల్లుల్లికి దూరంగా ఉండాలి. చలి సంబంధిత సమస్యలున్నప్పుడు వెల్లుల్లి తినడం చాలామందికి అలవాటు. ఆరోగ్యానికి ఎంతమంచిదైనా సరే రోజుకు 1-2 రెమ్మలకు మించి తినకూడదు. అదే పనిగా వెల్లుల్లి తింటే నోటి దుర్వాసన కూడా వస్తుంది.



## ఒత్తిడిని తగ్గించుకోవాలంటే ఏం చేయాలో తెలుసా?

ఈ రోజుల్లో ఉద్యోగ రీత్యా లేదా ప్రేమ, డబ్బు లేదా ఫ్యామిలీ పరంగా ఏదయినా కారణం చేత చాలామంది టెన్షన్ లేదా ఒత్తిడికి గురవుతారు. దీని వలన మన మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. ప్రతి చిన్న దానికి ఎక్కువగా ఆలోచించడం వలన కూడా టెన్షన్, ఒత్తిడి వంటివి పెరుగుతాయి. మనం ఇతరులతో ఎలా మాట్లాడాలి వారు మనకు ఎలా స్పందిస్తారో ముందుగా ఊహించుకొని మనం అనుకున్న అంచానాలు రీచ్ అవ్వకపోయినా ఒత్తిడికి గురవుతారు. కాబట్టి మనం ప్రతి విషయంలో ఎలా జరిగిన దానిని స్వీకరించగలగాలి అంతేగాని దాని గురించి ఆలోచిస్తూ ఉండకూడదు. మన మూడ్ సరిగ్గా లేకపోయిన ఆ సమయంలో మనం తీసుకునే నిర్ణయాలు చెడుగా ఉంటాయి. దీని వలన మనం అవతలివారిలో నెగిటివిటీ ని పెంచిన వారమవుతాము. తరువాత మనం వారు మన గురించి ఏమి ఆలోచిస్తున్నారో అని అనుకుంటూ ఉంటాము ఇలా ఆలోచనలతో ఒత్తిడికి గురవుతాము. కాబట్టి మన మూడ్ బాగోలేనప్పుడు ఎటువంటి నిర్ణయాలు తీసుకోకపోవడమే మంచిది. లావుగా ఉన్నామని లేదా సన్నగా ఉన్నామని లేదా ఏదయినా మానసిక, శారీరక సమస్య వచ్చినా కొందరు చాలా బాధపడుతుంటారు. అంతే కానీ సమస్యకు పరిష్కారం వెతకరు. కాబట్టి మనం ఏదయినా సమస్య వచ్చినప్పుడు బాధపడకుండా దానికి పరిష్కారం వెతకాలి. ఈ మధ్య చాలామంది దానిలోనే సినిమాలు, సీరియళ్లు, షోస్ చూస్తున్నారు కాబట్టి దీని వలన మనం ఎక్కువ సమయం స్క్రీన్ మీద గడుపుతున్నారు. దీని వలన మెంటల్ హెల్త్ ఇష్యూస్ వచ్చే అవకాశం ఉంది. కాబట్టి మనం లో సినిమాలు, సిరీస్ లు చూసేటప్పుడు మధ్యమధ్యలో బ్రేక్ ఇస్తూ ఉండాలి దాని వలన మన ఆరోగ్యానికి మంచిది. ఒత్తిడి వలన మనకు గుండె సమస్యలు, ఆస్తమా, హైపర్ టెన్షన్, జుట్టు రాలడం వంటి సమస్యలు వస్తాయి. ఒత్తిడిని, టెన్షన్ ను తగ్గించుకోవడానికి మనం మొదట ఎక్కువగా ఆలోచించడం తగ్గించు కోవాలి. ఇంకా యోగా, ధ్యానం వంటివి చేస్తూ ఉండాలి. వీటి వలన రిలీఫ్ గా ఉంటుంది.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



# రాజస్థాన్ రాయల్స్ పై టాస్ గెలిచిన ఢిల్లీ... ఐపీఎల్ అరంగేట్రం చేస్తున్న శ్రీకాకుళం కుర్రాడు

**రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్‌లో టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఢిల్లీ క్యాపిటల్స్**

**ప్లే ఆఫ్స్ రేసులో నిలవాలంటే ఇరు జట్లకు ఈ మ్యాచ్ అత్యంత కీలకం**

**ఢిల్లీ తరపున త్రిపురాన విజయ్ అరంగేట్రం**

**రాజస్థాన్ జట్టులోకి రవి సింగ్.. రవీంద్ర జడేజాకు విశ్రాంతి**

**గాయం నుంచి కోలుకుని ఆర్ఆర్ కెప్టెన్‌గా తిరిగొచ్చిన రియాన్ పరాగ్**

ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా రాజస్థాన్ రాయల్స్ తో కీలక మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం ఈ పోరుకు వేదికైంది. ప్లే ఆఫ్స్ ఆశలు సజీవంగా నిలుపుకోవాలంటే ఈ మ్యాచ్‌లో గెలవడం ఇరు జట్లకు తప్పనిసరి. ఈ నేపథ్యంలో ఇరు జట్లు మార్పులతో బరిలోకి దిగాయి.టాస్ గెలిచిన అనంతరం ఢిల్లీ కెప్టెన్ అక్షర్ పటేల్ మాట్లాడుతూ, తమ సొంత మైదానంలో ఇదే చివరి మ్యాచ్ అని, జట్టులో ఒక మార్పు చేసినట్లు తెలిపాడు. యువ ఆల్ రౌండర్ త్రిపురాన విజయ్ ఈ మ్యాచ్‌తో అరంగేట్రం చేస్తున్నాడని, అకిబ్ నబీ స్థానంలో అతడు తుది జట్టులోకి వచ్చాడని చెప్పాడు.

ఎవరీ త్రిపురాన విజయ్?

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువ క్రికెటర్ త్రిపురాన విజయ్ దేశవాళీ క్రికెట్‌లో తన ప్రతిభతో ఆకట్టుకుంటున్నాడు. శ్రీకాకుళం జిల్లా టెక్కలికి చెందిన ఈ 24 ఏళ్ల ఆటగాడు, కుడిచేతి వాటం ఆఫ్ బ్రేక్ బౌలర్‌గా రాణిస్తున్నాడు. దేశవాళీ టోర్నీలలో ఆంధ్రా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న విజయ్, ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో సభ్యుడిగా చోటు దక్కించుకున్నాడు. బ్యాటింగ్ కూడా చేయగల విజయ్, బౌలింగ్‌లో తనదైన శైలిలో రాణిస్తూ సెలక్టర్ల దృష్టిని ఆకర్షిస్తున్నాడు.విజయ్ తన బౌలింగ్‌తో ముఖ్యంగా ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అద్భుత ప్రదర్శన కనబరుస్తున్నాడు. ఇప్పటివరకు 16 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడి 52 వికెట్లు పడగొట్టాడు. ఇందులో ఒకే ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు, మ్యాచ్‌లో 10 వికెట్లు తీసిన ఘనత కూడా ఉంది. ఇటీవల నాగాలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 10 వికెట్ల ప్రదర్శనతో పాటు 58 పరుగులు చేసి ఆల్ రౌండ్ సత్తా చాటాడు. లిస్ట్ ఏ, టీ20 ఫార్మాట్లలోనూ ఆంధ్రా తరపున ఆడుతున్న ఈ యువ ప్రతిభ, భవిష్యత్తులో కీలక ఆటగాడిగా ఎదిగే అవకాశాలున్నాయని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు.

జట్టులోకి వచ్చిన రియాన్ పరాగ్

మరోవైపు, తొడ కండరాల గాయం నుంచి కోలుకుని రాజస్థాన్ కెప్టెన్‌గా రియాన్ పరాగ్ తిరిగి జట్టులోకి వచ్చాడు. టాస్ సమయంలో పరాగ్ మాట్లాడుతూ, పని భారం కారణంగా స్టార్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజాకు విశ్రాంతినిచ్చామని తెలిపాడు. అతని స్థానంలో వికెట్ కీపర్ బ్యాటర్ రవి సింగ్ అరంగేట్రం చేస్తున్నాడని ప్రకటించాడు. అదే సమయంలో ఆడమ్ మిల్నే కూడా జట్టులోకి వచ్చాడని వివరించాడు. గత కొన్ని మ్యాచ్‌లుగా తాము నిర్దేశించిన స్కోర్లను కాపాడుకోలేకపోతున్నామని, అందుకే ఈసారి అదనపు సీమర్‌తో ఆడుతున్నామని పరాగ్ పేర్కొన్నాడు.



# చెలరేగిన రాజస్థాన్ టాపార్డర్.. ఢిల్లీ టార్గెట్ 194

**ఢిల్లీ క్యాపిటల్స్‌కు 194 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించిన రాజస్థాన్ రాయల్స్**

**హాఫ్ సెంచరీలతో రాణించిన రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్**

**విజృంభించి ఆడిన యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ**

**నాలుగు వికెట్లు తీసినా భారీగా పరుగులు ఇచ్చిన మిచెల్ స్టార్క్**



ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో రాజస్థాన్ రాయల్స్ టాపార్డర్ చలవతో భారీ స్కోరు సాధించింది. ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్, నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 193 పరుగులు నమోదు చేసింది. రాజస్థాన్ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ రియాన్ పరాగ్ (26 బంతుల్లో 51), ధ్రువ్ జురెల్ (40 బంతుల్లో 53) హాఫ్ సెంచరీలతో చెలరేగారు. ముఖ్యంగా పరాగ్ తన ఇన్నింగ్స్‌లో 3 ఫోర్లు, 5 సిక్సర్లతో ఢిల్లీ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఆరంభంలో యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ కేవలం 21 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 46 పరుగులు చేసి అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చాడు. ఈ ముగ్గురి దూకుడుతో రాజస్థాన్ స్కోరు బోర్డు పరుగులు పెట్టింది.ఢిల్లీ బౌలర్లలో మిచెల్ స్టార్క్ 4 వికెట్లు పడగొట్టినప్పటికీ, 40 పరుగులు సమర్పించుకుని ఖరీదైన బౌలర్‌గా నిలిచాడు. అయితే ఒకే ఓవర్లో రెండు కీలక వికెట్లు తీసి రాజస్థాన్ జోరుకు కొంత బ్రేక్ వేశాడు. లుంగి ఎంగిడి (2/24), మాధవ్ తివారీ (2/27) పొదుపుగా బౌలింగ్ చేసి ఆకట్టుకున్నారు. అంతకుముందు టాస్ గెలిచిన ఢిల్లీ కెప్టెన్ అక్షర్ పటేల్ ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. సొంత మైదానంలో ఈ భారీ లక్ష్యాన్ని ఢిల్లీ ఎలా ఛేదిస్తుందో వేచి చూడాలి.

# ఐపీఎల్ ప్లే ఆఫ్స్‌లోకి దూసుకెళ్లిన ఆర్‌సీబీ.. పంజాబ్‌పై ఘన విజయం

**పంజాబ్ కింగ్స్‌పై 23 పరుగుల తేడాతో గెలిచిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు**

**ఈ విజయంతో ఐపీఎల్ 2026 ప్లే ఆఫ్స్‌కు చేరిన తొలి జట్టుగా ఆర్‌సీబీ ఘనత**

**అర్ధ సెంచరీలతో రాణించిన వెంకటేశ్ అయ్యర్, విరాట్ కోహ్లీ**

**పంజాబ్ తరఫున శశాంక్ సింగ్ మెరుపు హాఫ్ సెంచరీ చేసినా ఫలితం శూన్యం**

**బెంగళూరు విజయంలో కీలకపాత్ర పోషించిన రసిఖ్ సలామ్ దార్**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) అద్భుత ప్రదర్శనను కొనసాగిస్తూ ప్లే ఆఫ్స్‌లోకి అడుగుపెట్టింది. ఆదివారం ధర్మశాల వేదికగా పంజాబ్ కింగ్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో ఆర్‌సీబీ 23 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో, ఈ సీజన్‌లో ప్లే ఆఫ్స్ బెర్తును ఖాయం చేసుకున్న తొలి జట్టుగా ఆర్‌సీబీ నిలిచింది. తొలుత బ్యాటింగ్‌లో వెంకటేశ్ అయ్యర్, విరాట్ కోహ్లీ అర్ధ సెంచరీలతో చెలరేగగా, అనంతరం బౌలర్లు రాణించడంతో బెంగళూరు ఖాతాలో మరో గెలుపు చేరింది. శశాంక్ సింగ్ వీరోచిత పోరాటం చేసినా పంజాబ్‌కు ఓటమి తప్పలేదు.223 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ కింగ్స్‌కు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. భువనేశ్వర్ కుమార్ ధాటికి ప్రియాన్ష్ ఆర్య (0), ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (2) పెవిలియన్ చేరారు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (1) కూడా విఫలమవడంతో పంజాబ్ 19 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో కూపర్ కనోలీ (37), సూర్యాంశ్ షెడ్గే (35), మార్కస్ స్టొయినిస్ (37) ఫర్వాలేదనిపించారు. అయితే, అసలు సంచలనం శశాంక్ సింగ్ రూపంలో వచ్చింది. కేవలం 27 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 56 పరుగులు చేసిన శశాంక్, ఒకానొక దశలో పంజాబ్‌కు విజయంపై ఆశలు రేపాడు. కానీ, కీలక సమయంలో రసిఖ్ సలామ్ దార్ అతన్ని ఔట్ చేయడంతో మ్యాచ్ మలుపు తిరిగింది. చివరికి పంజాబ్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 199 పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలైంది. ఆర్‌సీబీ బౌలర్లలో రసిఖ్ సలామ్ దార్ 3 వికెట్లతో చెలరేగగా, భువనేశ్వర్ కుమార్ రెండు వికెట్లు పడగొట్టాడు.అంతకుముందు, టాస్ గెలిచిన పంజాబ్ కింగ్స్ ఫీల్డింగ్ ఎంచుకోగా, ఆర్‌సీబీ బ్యాటింగ్‌కు దిగింది. ఆరంభంలోనే జాకబ్ బెథెల్ (11) వికెట్ కోల్పోయినా, కెప్టెన్ విరాట్ కోహ్లీ (37 బంతుల్లో 58; 4 ఫోర్లు, 3 సిక్సులు), దేవదత్ పడిక్కల్ (25 బంతుల్లో 45; 4 ఫోర్లు, 3 సిక్సులు) అద్భుతమైన భాగస్వామ్యంతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. వెంకటేశ్ అయ్యర్ అసలు సిసలు విధ్వంసం సృష్టించాడు. కేవలం 40 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో అజేయంగా 73 పరుగులు చేశాడు. చివర్లో టిమ్ డేవిడ్ (12 బంతుల్లో 28) కూడా మెరుపులు మెరిపించడంతో ఆర్‌సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 222 పరుగుల భారీ స్కోరు సాధించింది.



# తిలక్ వర్మ, శ్రీలీల రిలేషన్‌లో ఉన్నారా? ఇదిగో క్లారిటీ!

**నటి శ్రీలీల, క్రికెటర్ తిలక్ వర్మ మధ్య రిలేషన్ అంటూ ప్రచారం**

**ఈ వార్తల్లో నిజం లేదని స్పష్టం చేసిన సన్నిహిత వర్గాలు**

**ఇద్దరూ ఇప్పటివరకు కనీసం కలుసుకోలేదని వెల్లడి**

**సోషల్ మీడియా ఫ్యాన్ పేజీలే ఈ పుకార్లకు కారణమని తేల్చిచెప్పిన వైనం**

టాలీవుడ్ నటి శ్రీలీల, యువ క్రికెటర్ తిలక్ వర్మ మధ్య ప్రేమాయణం నడుస్తోందంటూ గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని తేలిపోయింది. ఈ ఊహాగానాలను వారి సన్నిహిత వర్గాలు పూర్తిగా ఖండించాయి. ఇది కేవలం నిరాధారమైన ప్రచారమని స్పష్టం చేశాయి.ఈ పుకార్లపై ఓ సన్నిహిత వర్గం స్పందిస్తూ.. “శ్రీలీల, తిలక్ వర్మ మధ్య సంబంధం ఉందన్న వార్తలు పూర్తిగా నిరాధారమైనవి, అసత్యం. వాళ్లిద్దరూ ఇప్పటివరకు కనీసం ఒకరినొకరు కలుసుకోలేదు, మాట్లాడుకోలేదు కూడా” అని స్పష్టం చేసింది. ఎలాంటి ఆధారాలు లేకుండా ఇలాంటి కల్పిత కథలను ప్రచారం చేయడం సరికాదని హితవు పలికింది.అసలు ఈ ప్రచారం ఎలా మొదలైందంటే.. వేర్వేరు సందర్భాల్లో ఆలయాలు, ఇతర కార్యక్రమాల్లో వారిద్దరూ కనిపించడంతో, వాటిని ముడిపెడుతూ కొన్ని ఫ్యాన్ పేజీలు, గాసిప్ అకౌంట్లు ఈ పుకార్లను సృష్టించాయి. అయితే ఈ ఘటనలకు, వారి మధ్య వ్యక్తిగత సంబంధానికి ఎటువంటి సంబంధం లేదని తేలింది. ఇక శ్రీలీల విషయానికొస్తే, సౌత్, నార్త్ చిత్రాలతో దూసుకెళుతున్నారు. మరోవైపు, హైదరాబాదీ క్రికెటర్ తిలక్ వర్మ ముంబై ఇండియన్స్ తరఫున ఐపీఎల్‌లోకి అడుగుపెట్టి తన ఆటతీరుతో అందరిని ఆకట్టుకుంటున్నాడు. మొత్తమ్మీద, ఇద్దరి మధ్య రిలేషన్ ఉందన్న వార్త కేవలం సోషల్ మీడియా సృష్టించిన ఓ గాలివార్త మాత్రమేనని స్పష్టమైంది.



మన దునియా
RNI Number
TTTTT/2023/85680
మన అక్షరం - మన ప్రపంచం

## మెగా158 కోసం చిరంజీవి హార్డ్ వర్క్...

## వర్కౌట్స్ వీడియో చూస్తే వావ్ అనాల్సిందే!

**బాబీ దర్శకత్వంలో తన 158వ సినిమాకు సిద్ధమవుతున్న చిరంజీవి**

**జిమ్‌లో తీవ్రంగా కసరత్తులు చేస్తున్న వీడియోను పంచుకున్న మెగాస్టార్**

**మే 21న ఈ సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమం**

**ప్రస్తుతం వశిష్ఠ దర్శకత్వంలో విశ్వంభర చిత్రంలో నటిస్తున్న చిరు**

**చిరంజీవి డెడికేషన్‌పై అభిమానుల ప్రశంసలు**



మెగాస్టార్ చిరంజీవి ఈ వయసులోనూ తన ఉత్సాహం, ఎనర్జీతో యువ హీరోలకు స్ఫూర్తినిస్తూనే ఉన్నారు. ప్రస్తుతం 'విశ్వంభర' వంటి భారీ సినిమాలో నటిస్తూనే, తన తదుపరి చిత్రం కోసం కూడా సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో ఆయన జిమ్‌లో కఠినమైన వర్కౌట్లు చేస్తున్న వీడియోను సోషల్ మీడియాలో పంచుకోగా, అది వైరల్ అవుతోంది.దర్శకుడు బాబీతో తన 158వ సినిమా చేస్తున్నట్లు చిరంజీవి ప్రకటించారు. మే 21న ఈ సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనున్నట్లు తెలిపారు. ఈ మేరకు తన ట్వీట్‌లో, "ప్రతిరోజూ పరిధులు దాటి పనిచేయడానికి దొరికే మరో అవకాశం. నా ప్రియమైన బాబీతో మరో గుర్తుండిపోయే ప్రయాణం కోసం ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా" అని పేర్కొన్నారు. ఈ వీడియోలో చిరంజీవి తీవ్రంగా చెమటోడుస్తూ కసరత్తులు చేయడం ఆయన డెడికేషన్‌కు నిదర్శనంగా నిలుస్తోంది.కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి చవీవస్త్రు158 అనే వర్కింగ్ టైటిల్‌ను ఖరారు చేశారు. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ వచ్చిన సంగతి తెలిసిందే. దాంతో ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ప్రస్తుతం చిరంజీవి వశిష్ట దర్శకత్వంలో 'విశ్వంభర' సినిమాలో నటిస్తున్నారు. ఆ సినిమా షూటింగ్ జరుపుకుంటుండగానే మరో ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ఆయన స్పీడ్ కు నిదర్శనమని అభిమానులు అంటున్నారు. ప్రస్తుతం ఈ వర్కౌట్ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతూ, మెగాస్టార్ డెడికేషన్‌పై ప్రశంసల వర్షం కురిపిస్తోంది.

## విజయ్ నాకు సమవుజ్జీ కాదు..

## రజినీకాంత్ సంచలన వ్యాఖ్యలు


**కమల్ సీఎం అయితే అసూయపడతా**

**స్టాలిన్ నాకు మంచి మిత్రుడు**

**పార్టీ పెడితే కచ్చితంగా గెలిచేవాణ్ని**

**రాజకీయాలతో సంబంధం లేదు**

తమిళనాడు ప్రజలు మార్పు కోరుకున్నారని.. అందుకే విజయ్ గెలిచారని స్టార్ హీరో రజినీకాంత్ అన్నారు. తనకు రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదన్నారు. తానే గనక పార్టీ పెడితే కచ్చితంగా గెలిచేవాడినన్నారు. డీఎంకే అధినేత స్టాలిన్ తనకు మంచి స్నేహితుడని తెలిపారు. అందుకే ఆయన్ని కలిసినట్లు వెల్లడించారు. ఎన్నికల ఫలితాల అనంతరం స్టాలిన్‌ను కలిసిన నేపథ్యంలో రజినీపై విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఆదివారం చెన్నైలోని తన నివాసంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరణ ఇచ్చారు. మరోవైపు విజయ్ సీఎంగా గెలవకూడదని తాను ఎలాంటి ప్రయత్నం చేయలేదని రజినీకాంత్ చెప్పారు. విజయ్‌ను తనకు సమవుజ్జీగా భావించడం లేదన్నారు. తమ వయసులో 28 ఏళ్ల వ్యత్యాసం ఉందన్నారు. కమల్ హాసన్ సీఎం అయితే అసూయ పడతాను గానీ, విజయ్ విషయంలో అలాంటిదేమీ లేదన్నారు. రెండు ప్రధాన పార్టీలను ఢీకొని గెలిచిన విజయ్‌కు తాను శుభాకాంక్షలు తెలిపానని గుర్తుచేశారు.ఇటీవల ఎయిర్‌పోర్టులో ఓ వ్యక్తి విజయ్ గురించి ప్రస్తావించగా రజినీకాంత్ నవ్వుతూ వెళ్లిపోయిన విషయం తెలిసిందే. దీనిపై విమర్శలు రావడాన్నీ రజినీ తాజాగా ప్రస్తావించారు. ఎవరో వ్యక్తి ఫోన్‌లో రికార్డు చేస్తూ అడిగిన ప్రశ్నకు తాను స్పందించలేదన్నారు. తాను అనవసరంగా ఇతర విషయాల గురించి మాట్లాడే వ్యక్తిని కాదన్నారు.





## రేపటి నుంచే 'పెద్ది' పోరాటం... ముంబైలో

## ట్రైలర్ టేకోవర్ కు అంతా రెడీ!

**రేపు ముంబైలో 'పెద్ది' ట్రైలర్ విడుదల**

**రామ్ చరణ్, జాన్వీ కపూర్ జంటగా**

**బుచ్చిబాబు దర్శకత్వం**

**జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా సినిమా రిలీజ్**

**ట్రైలర్‌కు ముందు జగపతి బాబు క్యారెక్టర్ గ్లింప్స్ విడుదల**

**ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న పాన్-ఇండియా చిత్రం**

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వస్తున్న భారీ చిత్రం 'పెద్ది'. ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్ రేపటి నుంచి ఫుల్ స్పీడ్ లో కొనసాగనున్నాయి. ఈ చిత్రం ట్రైలర్‌ను మే 18న ముంబైలో ఒక గ్రాండ్ ఈవెంట్ లో విడుదల చేసేందుకు సర్వం సిద్ధమైంది. "అతడి పోరాటం రేపటి నుంచి మొదలు" అనే క్యాప్షన్‌తో పెద్ది టీమ్ ప్రచారాన్ని హోరెత్తిస్తోంది. "పెద్ది ట్రైలర్ టేకోవర్" పేరుతో ముంబైలోని జియో వరల్డ్ డ్రైవ్‌లో మే 18న మధ్యాహ్నం 3 గంటల నుంచి ఈ ఈవెంట్ జరగనుంది. ఈ సందర్భంగా సినిమా ట్రైలర్‌ను అభిమానులు, మీడియా సమక్షంలో విడుదల చేయనున్నారు. ఇప్పటికే విడుదల చేసిన పోస్టర్లు, ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి.ఈ చిత్రంలో రామ్ చరణ్‌కు జోడీగా జాన్వీ కపూర్ నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా, విజయనగరం నేపథ్యంలో సాగే ఒక గ్రామీణ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, జగపతి బాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ట్రైలర్ విడుదలకు ముందు ప్రమోషన్స్‌ను వేగవంతం చేసిన మేకర్స్, మే 17న నటుడు జగపతి బాబు పాత్రకు సంబంధించిన ప్రత్యేక గ్లింప్స్‌ను విడుదల చేసి క్యూరియాసిటీని పెంచారు. ఇప్పటికే విడుదలైన 'చికిరి చికిరి', 'రై రై రా రా' పాటలు సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తుండగా, ఓవర్సీస్‌లో ప్రీ-సేల్స్ కూడా భారీ స్థాయిలో జరుగుతున్నాయి. ఈ చిత్రాన్ని జూన్ 4న తెలుగు, హిందీ, తమిళం సహా పలు భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cel1 No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com